www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, 28.04.2023
హైదరాబాద్
సంపుటి: 2, సంచిక: 196

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



హైదరాబాద్ రియల్ ట్రెండ్ ఇదే

03

- జనగణన చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచుతాం
- దేశంలో బీసీల జనాభా 50 శాతం కంటే ఎక్కువే ఉంది
- బీజేపీ గెలిస్తే దేశానికి అత్యంత ప్రమాదం
- రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలపై ఆ పార్టీ దాడి
- బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయి
- మల్లారెడ్డి మాటలతో అది నిజమని తేలింది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



# అన్ని కూలాలకు రిజర్వేషన్లు ఇస్తాం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీసీలు 50శాతానికి పైగా ఉన్నారని, జనగణన చేసి వారికి రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ''ఈ దేశ రాజకీయాలను, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభావితం చేసే అంశంపై విస్పష్టంగా మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. అక్రమంగానో.. దౌర్జన్యంగానో.. 400సీట్లు సాధించి రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలపైనే దాడి చేయాలని మోదీ, అమిత్ షా కంకణ బద్ధులై ఉన్నారు. ఇందులో భాగంగానే దేశం నలుమూలలా తిరుగుతూ అన్ని రకాల వ్యవస్థలు, సంస్థల్ని ఉపయోగించుకొని ముప్పేట దాడి చేస్తున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత భాజపాపై .. కాంగ్రెస్ స్పష్టమైన ఆరోపణలు చేస్తోంది. కాంగ్రెస్ ప్రశ్నలకు ఇప్పటి వరకు నరేంద్ర మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా సమాధానం చెప్పలేదు. ప్రజాస్వామ్య విలువలు, విధానాలకు విరుద్ధంగా వారు వ్యవహరిస్తున్నారు.

ఆర్ఎస్ఎస్ మనువాద విధానాన్ని అమలు చేయాలని వారిద్దరూ ప్రయత్నిస్తున్నారు. వివిధ కులాలు, వర్గాలు ఉంటే హిందువులు ఏకతాటి మీదకురారు అనేది భాజపా కుట్ర. రిజర్వేషన్లు రద్దు చేస్తే.. వేర్వేరు కులాలు, వర్గాల ప్రస్తావన లేకుండా పోతుందనేది ఆ పార్టీ ఆలోచన. వచ్చే ఏడాదికి ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు అవుతుంది. 2025 నాటికి రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనేది ఆర్ఎస్ఎస్ లక్ష్యం. రాజ్యాంగాన్ని మార్చాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం. అందుకే 400 సీట్లలో గెలిపించాలని మోదీ పదే పదే కోరుతున్నారు. భారత్‌ను రిజర్వేషన్ రహిత దేశంగా మార్చాలని మోదీ, అమిత్ షా భావిస్తున్నారు'' అని రేవంత్ ఆరోపించారు.

## భారాస, భాజపా కుమ్మక్కు రాజకీయాలు

“రిజర్వేషన్ల రద్దుపై భాజపా, భారాస ఒకే విధానంతో ఉన్నాయి. ఆ రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. మల్కాజిగిరిలో భాజపాను గెలిపిస్తామని నిన్న భారాస ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఆయనపై కేటీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఈటలను కేటీఆర్ ఎందుకు విమర్శించడం లేదు? ఐదు నియోజకవర్గాల్లో భాజపాకు భారాస మద్దతు ఇస్తోందని నేను చెబుతూనే ఉన్నా. అది నిజమని నిన్న మల్లారెడ్డి మాటలతో స్పష్టమైంది. పదేళ్లపాటు కేసీఆర్ భూములు అమ్ముతుంటే ఈటల రాజేందర్ ఎప్పుడైనా మాట్లాడారా? నేను రుణమాఫీ చేస్తాను అనగానే భూములు అమ్మవద్దని ఈటల కండీషన్లు పెడతున్నారు. దేశంలో రిజర్వేషన్లు కొనసాగాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలి” అని రేవంత్ విజ్ఞప్తి చేశారు

# హిమంతా.. నీకంత సీన్ లేదు

- నేను మాట్లాడాలనుకున్నది మోడీతో..
- ఆయన టైం ఇస్తే మేనిఫెస్టోపై చర్చిస్తా
- మధ్యలో నీకెందుకు అంత బాధ
- ఏఐసీసీ చీఫ్ ఖర్గే పంచ్‌లు



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

తమ మేనిఫెస్టో గురించి వివరించేందుకు ప్రధాని మోదీతో భేటీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల సమయం అడిగిన సంగతి తెలిసిందే. దీనిని ఉద్దేశించి అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలకు ఖర్గే ఘాటుగా బదులిచ్చారు. ఇంతకీ విషయం ఏంటంటే..? అస్సాంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ..''నేను మోదీతో మాట్లాడాను. సీఎంతో కాదు. నేను రాజ్యసభలో ప్రతిపక్ష నేతను. నేను లోక్‌సభకు కూడా ప్రాతినిధ్యం వహించాను. పార్లమెంటరీ వ్యవహారాలపై నాకు అవగాహన ఉంది. మరి అప్పుడు నా ప్రత్యర్థి మోదీనే కదా. నేను ఆయనతో మాట్లాడతాను. మధ్యలో ఈయన (హిమంత) ఎందుకు బాధ పడుతున్నారు. ఇక్కడ మా వాళ్లను ఎదుర్కొని, నా గురించి మాట్లాడితే బెటర్'' అని ఖర్గే చురకలు అంటించారు. ఇటీవల మోదీకి ఖర్గే లేఖ రాసిన సంగతి తెలిసిందే. అలాగే భేటీకి సమయం అడిగారు. దానిపై హిమంత స్పందిస్తూ..'' ప్రధాని మోదీకి ఇంగ్లీష్ వచ్చు. మీరు మేనిఫెస్టోను హిందీ, ఇంగ్లీష్‌లో విడుదల చేశారు. మరింక కలిసి మాట్లాడటం ఎందుకు..? ఈ సమయంలో ఖర్గే, బీజేపీ మధ్య సమావేశం ఎందుకు..? ఒకవేళ ఆయన బీజేపీలో చేరాలనుకుంటే.. రావొచ్చు. నేను ఆయన ఇంటికి వెళ్లి, రక్షణగా ఉంటాను. లేకపోతే.. మోదీతో భేటీ అవసరం ఏముంది'' అని ప్రశ్నించారు. సంపద పునఃపంపిణీ, మంగళసూత్రం, వారసత్వ పన్ను.. తన ప్రసంగాల్లో ఈ పదాలను ఉపయోగించి ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై హస్తం పార్టీ నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. ఈ సమయంలో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీకి లేఖ రాశారు. ''మీ ప్రసంగాలకు మీ సొంత వ్యక్తులు కొట్టే చప్పట్లు చూసి, మోసపోకండి. మీ మాటలతో నిరాశకు గురైన కోట్లాది మంది ప్రజల అభిప్రాయాలను మీ దరి చేరనివ్వడం లేదు'' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## రేవంత్ ఏనాడైనా మాట మీద నిలబడ్డవా?

వివరాలు 2లో



# సీపీఎం మద్దతు కోరాం

- భువనగిరిలో సపోర్ట్ చేయాలని అడిగాం
- కొన్ని రాజకీయ ప్రతిపాదనలు వారి ముందు పెట్టాం
- బీజేపీ శక్తులను ఓడించేందుకు మాకు మద్దతు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సీపీఎం నేతలతో భేటీ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సీపీఎం నేతలు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, వీరయ్య తదితరులు కలిశారు. భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ తో పాటు ఇతర స్థానాల్లోనూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సీపీఎం నాయకులను కోరామని తెలిపారు. ఈ విషయమై సీపీఎం నేతలతో చర్చించామని వెల్లడించారు. మరి కొన్ని రాజకీయ ప్రతిపాదనలు కూడా వారి ముందు పెట్టామని తెలిపారు. బీజేపీ శక్తులను ఓడించేందుకు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చేందుకు వారు అంగీకరించారని వెల్లడించారు. దేశంలోనూ ఇండియా కూటమితో కలిసి పనిచేయనున్నారని.. ఒకట్రెండు విషయాల్లో సందిగ్ధత ఉన్నా.. అధిష్టానంతో చర్చించి రేపటిలోగా ఏకాభిప్రాయానికి వస్తామన్నారు. సీపీఎం సహకారంతో భవిష్యత్ లో ముందుకెళతామని.. ఈ కలయిక రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు పనిచేస్తుందని భావిస్తున్నానని అన్నారు.

# బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గాయం

## హెలికాప్టర్ సీటులో కూర్చుంటుండగా గాయం

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి గాయపడ్డారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు శనివారం మధ్యాహ్నం పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని దుర్గాపుర్ నుంచి మమతా అసన్‌సోల్ వెళ్లేందుకు హెలికాప్టర్ ఎక్కారు. లోపలికి వెళ్లి సీట్లో కూర్చునే సమయంలో ఆమె బ్యాలెన్స్ మిగతా 2లో



# మహబూబ్‌నగర్‌లో పవర్ కట్ అవ్వలేదు

## కేసీఆర్ ట్వీట్‌పై స్పందించిన విద్యుత్ శాఖ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మహబూబ్‌నగర్ జిల్లాలో తన పర్యటన సమయంలో కరెంట్ కోతలు ఉన్నాయన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ట్వీట్‌పై టీఎస్ఎస్‌పీడీసీఎల్ స్పందించింది. ఆ రోజు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగలేదని స్పష్టం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రలో భాగంగా రెండురోజుల క్రితం మహబూబ్‌నగర్‌కు చేరుకున్నారు. అనంతరం అక్కడ జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని రాష్ట్రంలో కరెంట్ కోతలపై వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో

# పదెకరాలోడు ఏం పాపం చేసిండు

- రైతు బంధు ఎందుకు ఇస్తలేవు
- నీ అయ్య జాగీరు ఏమైనా ఇస్తున్నావా?
- ప్రజల సొమ్ము ఇచ్చేందుకు మనసు రావడం లేదా?
- రేవంత్ కొత్తగా పొడవాల్సింది ఏమీ లేదు
- మేం చేపట్టిన ప్రాజెక్టులు నడిపిస్తే చాలు
- నేను జనం తరపున మాట్లాడతా?.. కొట్లాడుతా
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటితే.. కాళ్లు తంగెళ్లు దాటడం లేదని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు సెటైర్లు వేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అయ్యా ముఖ్యమంత్రి ఇదేం పనయ్యా బాబు. నువ్వు కొత్తగా ఏమీ ఇవ్వకున్నా. నడిచినదాన్నే నడిపించవచ్చు కదా? ఇప్పుడు ఇంకోటి చెబుతున్నరు. మేం ఐదెకరాలకే రైతుబంధు ఇస్తున్నం అంటున్నరు. ఆరెకరాలోడు ఏం పాపం చేసిండు.. పదెకరాలోడు ఏం పాపం చేసిండు. రైతులంటే అంత చులకననా? 2030 ఎకరాలు ఇయ్యం అంటే అదొకమాట. కనీసం పది, పదిహేను ఎకరాలకైనా ఇవ్వాలి కదా? ఇయ్యాల్నా వద్దా? వీళ్ల అయ్య సొత్తు ఏమన్నా పోతదా? వీళ్ల జాగీరు పోతదా? మిగతా 2లో

# బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుంది

## కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ




**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

గుజరాత్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రా ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజ్యాంగాన్ని మార్చేస్తుందని ఆరోపించారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగంలో కీలక మార్పులు చేస్తామని స్వయంగా బీజేపీ నేతలే మీడియాకు చెప్తున్నారని ఆమె గుర్తుచేశారు. గుజరాత్‌లోని వల్సాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అనంత్ పటేల్‌కు మద్దతుగా శనివారం ప్రియాంకా గాంధీ ప్రచారం నిర్వహించారు. దేశంలో నెలకొన్న ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరల పెరుగుదలకు మోదీ పాలనా వైఫల్యమే కారణమని విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీని 'మెహంగాయి మ్యాన్' అంటే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

బీజేపీ నేతలు ప్రధాని మోదీ శక్తిమంతుడని పొగుడుతున్నారని, మోదీ చిటికె వేస్తే రష్యాఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుందంటున్నారని, అలాంటప్పుడు ఆయన మన దేశ పేదరికాన్ని ఎందుకు తొలగించలేకపోతున్నారని ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు ఉండటం వల్లే ప్రధాని మోదీ సిలిండర్ల ధరలను తగ్గించారని, ఆయనకు ప్రజలపై సానుభూతి లేదని విమర్శించారు.

మిగతా 2లో

# బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుంది

**మొదటిపేజీ తరువాయి**



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మీ నగలు, మంగళసూత్రం దొంగిలించి వేరొకరికి ఇస్తారని కూడా మోడీ మామయ్య ఎప్పుడో ఒకప్పుడు చెప్పడం మొదలు పెట్టే అవకాశం ఉందని ప్రియాంక గాంధీ ఎద్దేవా చేశారు. దేశ ప్రధాని హోదాలో మోదీ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తల్లులు, సోదరీమణుల బంగారం లెక్కిస్తామని తన మేనిఫెస్టోలో పేర్కొందని రాజస్థాన్‌లో ప్రధాని మోదీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలకు ప్రియాంక గాంధీ కౌంటర్ ఇచ్చారు.

# పదెకరాలోడు ఏం పాపం చేసిండు

**మొదటిపేజీ తరువాయి**

ప్రజల సొమ్మే కదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఇంత దుర్మార్గం ఎందుకు?

'ప్రపంచంలో ఈ రోజు గవర్నమెంట్ సపోర్టు లేకుండా ఏ దేశంలో వ్యవసాయం జరుగతలేదు. అందుకే నా మెదడు కరగవెట్టి.. భారతదేశంలో ఎక్కడాలేని విధంగా రైతుబంధు తీసుకువచ్చినం. టంచన్‌గా పడుతుంటే.. టింగు టింగుమని మీ సెల్‌ఫోన్లు మోగుతుండే. బ్రహ్మాండంగా మీరు పంటలు పండించారు. ధాన్యపు రాశులు వచ్చినయ్. మీరు నడి ఇంట్లో పడుకొని ఉంటే.. పొద్దుగాల పోతే పొలం పారి కనిపిస్తుండే. ఎందుకు ఈ నాలుగైదు నెలలకు ఇంత దుర్మార్గం ఎందుకు? తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్‌కు పంచాయితీ పడ్డది. ప్రజల తరఫున మాట్లాడేందుకు పంజు ఎవరు? కేసీఆర్ కొట్లాడాలా? యుద్ధం చేద్దామా?' అని కేసీఆర్ ప్రశ్నించగా.. కొట్లాడుదాం.. యుద్ధం చేద్దామంటూ' జనం నినదించారు. 'మీ అందరికీ దండం పెట్టి ఒకటే మాట చెబుతున్నా. మీరు మద్దతు ఇవ్వండి. నా ప్రాణంపోయి నా తెలంగాణ తెస్తా అని చెప్పి.. తెలంగాణ తెచ్చిన. మళ్లీ ఇవాళ నేను మిమ్మల్ని కోరుతున్నా. మీ తరఫున వాదించాలంటే.. దుర్మార్గపు కాంగ్రెస్ మెడలు వంచాలంటే నాకు మీ బలం ఇవ్వాలి' అన్నారు.

### అలంపూర్ బిడ్డనే గెలిపించాలి

'ఇక్కడ చదువుకున్న మాజీ ఐపీఎస్ అధికారి మన ప్రవీణ్‌కుమార్ గెలవాలి. ప్రవీణ్ అల్లాటప్ప రాజకీయ నాయకుడు కాదు. మాజీ ఐపీఎస్ అధికారి. ఇప్పుడేం మాట అన్నడు. నాగర్ కర్నూల్ నియోజకవర్గాన్ని ప్రపంచంలో పెట్టే స్థాయికి తీసుకుపోయే బాధ్యత నాది అని ఆయన మాట్లాండిడు. ఆయన ఎవరో కాదు. అలంపూర్‌లో పుట్టిన బిడ్డ. సొంత గడ్డకు సేవ చేయాలని మీ ముందుకు వచ్చాడు. ఆయనకు మీ బలాన్ని ఇస్తే.. ప్రవీణ్‌కుమార్, నేను మిగతా బృందం అంతా కలిసి ఈ ముఖ్యమంత్రి మెడలు వంచి అన్ని హామీలు అమలు చేస్తామని మనవి చేస్తున్నా. ఆ చైతన్యం రావాలి. యువ సోదరులకు మనవి చేస్తున్నా. ఈ రాష్ట్రం, ఈ దేశం మీది.. బుద్ధితో ఆలోచన చేయాలి. ఓ ఒరవడిలో కొట్టుకుపోవద్దు. మీ భవిష్యత్తు, ఈ రాష్ట్రం ముఖ్యం. ఓట్లు, ఎన్నికలు, నాయకులు వస్తూ ఉంటున్నారు. పోతుంటారు. కానీ, మన బతుకులు నిజం. మన బతుకులు నిజంగా ఉండాలి' అని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ గవర్నమెంట్ హయాంలో అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిలదీశారు. కొత్తగా గడ్డపార పట్టి తవ్వాల్సిన అవసరం లేదు కదా..? గత ప్రభుత్వంలో అమలైన పథకాలను అమలు చేయొచ్చు కదా..? అని అడిగారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.



ఇవాళ గొప్పదినం. తెలంగాణ పార్టీ పుట్టిన దినం. 23 ఏండ్ల క్రితం తెలంగాణ సాధించాలని ఆనాడు పిడికెడు మందితో, గుండె ధైర్యం తెచ్చుకుని ఏపీ నుంచి బయటపడాలని ఉక్కు సంకల్పంతో యుద్ధం ప్రారంభించాం. పెరిగాం. మహాసముద్రం అయ్యాం. ఉప్పెనలా ఉద్యమం నడిపాం. ఆ క్రమంలో చాలా సార్లు నాగర్‌కర్నూల్ వచ్చాను. పార్టీకి 14 ఏండ్లు పూర్తయ్యే సమయంలో ఆమరణ దీక్షకు పూనుకుని కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో తేలాలని ఆనాడు దీక్షకు పోతే ఖమ్మం జైల్లో వేశారు. మీరంతా ఉప్పెనలా ఉద్యమించారు. చివరకు కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నాం. తెచ్చుకున్న తెలంగాణలో పాలమూరు నా గుండెల్లో ఉంటది. ఈ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ సాధించుకున్నాం. ఆ గౌరవం చరిత్రలో మహబూబ్‌నగర్‌కు ఉంటది అని కేసీఆర్ తెలిపారు.

### కోడిపిల్లలను సాదుకున్నట్టు సాదుకున్నాం..

కులం, జాతి, మతం అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలను కోడి పిల్లలను సాదుకున్నట్టు పదేండ్లు గులాబీ జెండా కింద సాదుకుని, బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నాం. 50 ఏండ్లు కాంగ్రెస్, టీడీపీ పాలన ఉంటే పాత మహబూబ్‌నగర్ జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజైనా వచ్చిందా..? ఇవాళ ఐదు మెడికల్ కాలేజీలు వచ్చాయి బీఆర్ఎస్ రాజ్యంలో. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి తండ్రి చనిపోయినప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు పిలిపించుకుని బస్సులో గద్వాలకు ప్రయాణించాను. వలసలు పోయినా పాలమూరు ఎట్లుందో చూడాలని 200 కి.మీ. బస్సులో వెళ్లాను. చాలా ఆనందం, సంతోష పడ్డాను. వరికోతలు, ధాన్యపు రాశులు చూస్తే ఆనందం కలిగింది. నా పాలమూరు ఇంత బాగైందని సంతోష పడ్డాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

> **కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని తీసేశారా..?**
>
> సీఎం, మంత్రులు 24 గంటల కరెంట్ ఇస్తున్నాం అంటున్నారు. కానీ రోజుకు పది సార్లు పోతుంది. ఇవాళ శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో అన్నం తింటుంటే కరెంట్ పోయింది. కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని తీసేశారా అని అడిగాను. ఒక్కసారి కాదు.. రోజుకు పదిసార్లు పోతుందని చెప్పారు. ఇది కాంగ్రెస్ పరిపాలన.. మీరంతా కళ్లారా చూస్తున్నారు. బ్రహ్మాండంగా మిషన్ భగీరథతో ఇంటింటికి నీళ్లు అందించాం. ఇప్పుడు బోర్లు ఎందుకు వేస్తున్నారు..? నీళ్ల ట్యాంకర్లు ఎందుకు వస్తున్నాయి.? బిందెలతో ఆడబిడ్డలు కనిపిస్తున్నారు అని కేసీఆర్ తెలిపారు.

అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. మొన్న అడ్డగోలు హామీలిచ్చి దుష్ప్రచారాలు చేసి కేవలం ఒకటిన్నర శాతం ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రైతుబంధు అందరికీ వచ్చిందా..? ప్రతి ఆడబిడ్డకు రూ. 2500 వచ్చాయా..? రుణమాఫీ అయిందా..? తులం బంగారం వచ్చిందా..? అమ్మాయిలకు స్కూటీలు వచ్చాయా..? వరికి రూ. 500 బోనస్ వచ్చిందా..? చివరికి వస్తే ఎండింది ఎండంగ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పెడితే కొనే దిక్కు లేదు. వానలకు తడిసిపోతుంది తప్ప కొనే దిక్కు లేదు. ఈ ప్రభుత్వం పరిస్థితి ఇది. బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో ఒక్క ఏడాదిలోనే కరెంట్ 24 గంటలు ఇచ్చాం. రెప్పపాటు కరెంట్ పోలేదు. కాంగ్రెస్ రాజ్యంలో కరెంట్ పోతుంది. బావుల కాడ తేళ్లు, పాములు కడుతున్నాయి. ఇప్పటి వరకు 225 మంది రైతులు చనిపోయారు. కొందరు ఆత్మహత్య చేసుకున్నారు. కొందరు కరెంట్ షాకులతో, పాములు కరవడంతో చనిపోయారు. ఈ బాధ ఎందుకు వచ్చిందో ఆలోచన చేయండి. కేసీఆర్ పెట్టిన పథకాలు ఇవ్వాలి కదా.. కొత్తగా గడ్డపార పెట్టి తవ్వాల్సిన అవసరం లేదు కదా..? అని కేసీఆర్ ప్రశ్నించారు.

# మహబూబ్‌నగర్‌లో పవర్ కట్ అవ్వలేదు

**మొదటిపేజీ తరువాయి**

శుక్రవారం వాటిని మళ్లీ గుర్తు చేస్తూ తన అధికార ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. అందులో తెలంగాణలో చాలా చిత్రవిచిత్రమైన ఘటనలు జరుగున్నాయని తెలిపారు. తాను గంట క్రితం మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనానికి వెళ్లారని పేర్కొన్నారు. వారు తినేటప్పుడు రెండు సార్లు కరెంట్ పోయిందన్నారు.ప్రతి రోజు సీఎం, ఉప ముఖ్యమంత్రి పవర్ కట్ అవ్వలేదని ఊదర గొడుతున్నారని కేసీఆర్ విమర్శించారు. తనతో పాటు ఉన్న మాజీ ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు విద్యుత్ పోతుందని చెప్పిన విషయాన్ని ట్వీట్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న హస్తం పార్టీ పరిపాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలని పేర్కొన్నారు.

# బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గాయం

**మొదటిపేజీ తరువాయి**

కోల్పోయి కిందపడ్డారు. దీన్ని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే సాయం చేశారు. ఈ ఘటనలో ఆమెకు స్వల్ప గాయమైందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి తన ప్రయాణాన్ని కొనసాగించారని అధికారులు వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని తెలిపారు. అసన్‌సోల్ స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ నుంచి అలనాటి నటుడు, ఎంపీ శతృఘన్ సిన్హా పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా మమతా బెనర్జీ ప్రచారం చేపట్టారు. ఇదిలా ఉండగా, గత నెల మమతా బెనర్జీ దక్షిణ కోల్‌కతాలోని కాళీఘాట్ నివాసంలో ప్రమాదవశాత్తు గది నుంచి బయటకు వస్తున్న సమయంలో కింద పడిపోయారు. ఈ క్రమంలో ఆమె నుదిటిపై, ముక్కుపై తీవ్ర గాయమైంది. దీంతో భద్రతా సిబ్బంది ఆమెను వెంటనే కోల్కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఆమెను ట్రామా కేర్ సెంటర్కు తరలించారు. ఇక్కడ దీదీకి అవసరమైన అన్ని పరీక్షలు చేశారు డాక్టర్లు. ట్రీట్మెంట్ తర్వాత తన నివాసానికి తీసుకెళ్లారు. అనంతరం మమత నుదుటి నుంచి రక్తం కారుతున్న ఫొటోను పార్టీ విడుదల చేసింది. ఆ తర్వాత తలకు కట్టుతోనే ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇక, 2023 జూన్‌లోనూ బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గాయాలతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. సీఎం ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణం కారణంగా మమత ప్రయాణిస్తున్న హెలికాప్టర్ బైకుంఠ్‌పుర్ అటవీ ప్రాంతంలో ఒక్కసారిగా భారీ వర్షంలో చిక్కుకుంది. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ మొత్తం ఊగిపోయింది. ఈ క్రమంలో మమత నడుముకు, కాళ్లకు గాయాలయ్యాయి. పైలట్ చాకచక్యంగా వ్యవహరించి హెలికాప్టర్ను అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ముప్పు తప్పడం వల్ల అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కోల్కతాలోని ఓ ఆస్పత్రి వైద్యులు మమతకు చికిత్స చేశారు. ఈ ప్రమాదంలో ఆమె మోకాలు, తుంటి లిగ్‌మెంట్లకు గాయాలయ్యాయి

# బిఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే కార్మికుల జీవితాలు మెరుగ్గా లేవు

## మంత్రి పొన్నం ప్రభాకర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



పదేళ్లు అధికారంలో ఉన్న వారి నిర్లక్ష్యం వల్లే, కార్మికుల జీవితాలు మెరుగ్గా లేవని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్నవారు అనారోగ్య బాధితులకు చికిత్స ఎందుకు చేయించలేదని మండిపడ్డారు. కేటీఆర్, బండి సంజయ్ ఏం చేశారని, చేనేత కార్మికులకు తమ ప్రభుత్వంలో ఇళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కొందరు కార్మికులకు ఇల్లు లేదని, కొందరు అనారోగ్యంతో బాధపడుతున్నారని మంత్రి పొన్నం తెలిపారు. చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నేతన్నల జీవితాలు బాగు చేసేందుకు సలహాలు, సూచనలు కూడా తీసుకుంటామని పేర్కొన్నారు. సిరిసిల్లలో 26 వేల చేనేత మగ్గాలు ఉన్నాయని వాటిని ఆధునీకరించడమే కాకుండా ఎలాంటి పథకాలు అమలు చేయాలో తప్పకుండా ఎన్నికల తర్వాత చర్యలు చేపడతామని చెప్పారు. ఇవాళ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీతో కలిసి మంత్రి పొన్నం సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు మల్లేశం కుటుంబాన్ని పరామర్శించారు. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

# జస్ట్ ఆల్ ది బెస్ట్ చెప్పా

## మాజీ మంత్రి మల్లారెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**




శుక్రవారం ఓ శుభ కార్యక్రమంలో ఈటల రాజేందర్‌ను కలిసినప్పుడు మామూలుగా ఆల్ ది బెస్ట్ చెప్పానని, దానికే రాద్ధాంతం చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మండిపడ్డారు. పగవాడిని కూడా ఫ్రెండ్లీగా చూసే తత్వం తనదని, ఎవరు అభివృద్ధి చేస్తున్నారో ప్రజలకు అంతా తెలుసన్నారు. మేడ్చల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. రాష్ట్రంలో ఎవరూ చేయని అభివృద్ధిని కేసీఆర్ ఆశీర్వాదంతో తాను చేశారని పేర్కొన్నారు.ఇవాళ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి రాగాడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రెట్రో ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అంటే మోసమని, నగదు ఇచ్చే పథకాలను అమలు చేయడం లేదని మల్లారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు వాళ్లు వాళ్లే కొట్లాడుకోవడానికే సరిపోతుందని ఎద్దేవా చేశారు.రాష్ట్రానికి బీజేపీ ఏమీ చేయలేదని విమర్శించారు. బీజేపీకి దమ్ములేదని, రాముడి పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని మల్లారెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పాలమ్మిన, పూలమ్మిన అనే డైలాగ్ చెబితే ప్రపంచమే నివ్వెర పోయిందని, సోషల్ మీడియాలో రికార్డులు సృష్టించిందన్నారు. మల్లన్న తుమ్మితే తుపాన్ వస్తుందన్నారు.

# కిషన్ రెడ్డి స్క్రిప్ట్ లీడర్

- అతడికి సబ్జెక్ట్ లేదు
- అద్వానీ భిక్షతోనే మోడీ ప్రధాని
- ఉపాధి హామీ పథకం తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయే
- కేసీఆర్, కేటీఆర్ ఫ్రస్టేషన్ లో ఉన్నారు
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**




కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్క్రిప్ట్ లీడర్ అని.. ఆయనకు హిందూ సాంప్రదాయం గురించి ఏమాత్రం తెలియదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్రాల అధ్యక్షులు అందరూ దమ్మిలేనని విమర్శించారు. ఎల్కే అద్వానీ భిక్షతోనే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని చెప్పారు. శనివారం గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ... సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబం దేశ ప్రజల కుటుంబమని తెలిపారు. ఉపాధి హామీ పథకం అంటే గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అక్షయ పాత్ర లాంటిదని చెప్పుకొచ్చారు. గ్రామీణ అభివృద్ధి కోసం యూపీఏ చైర్మన్ సోనియా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు.మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డమైన కండీషన్లు పెట్టి ఈ పథకాన్ని రద్దు చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. మోదీ నిరుపేదలకు శాపంగా మారారని మండిపడ్డారు. దివంగత ప్రధానమంత్రి పీవీ నర్సింహారావుని ప్రధానిని చేసింది సోనియాగాంధీనే అని తెలిపారు. సోనియాగాంధీ 22 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా ఉన్నారని వివరించారు. ప్రధాని కావాలనుకుంటే రెండు సార్లు అయ్యేవారని ఉద్ఘాటించారు. సోనియాగాంధీని విమర్శించే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ ఓడిపోయామన్న ఫ్రస్టేషన్‌లో ఉన్నారన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలను పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరూ పట్టించుకోరన్నారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందన్నారు. బీఆర్ఎస్ బీజేపీలోని నేతలకు స్వేచ్ఛ ఉండదని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



# రేవంత్ ఏనాడైనా మాట మీద నిలబడ్డవా?

- కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం అంటివి
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓడిపోతే సేమ్ డైలాగ్ కొడితివి
- ఒక్కనాడైనా కట్టుబడ్డవా? .. ఇప్పుడు నిన్నెలా నమ్మాలి?
- రేవంత్ మాటల్లో నిజాయితీ ఉండదు..
- ఎన్నికలకు ముందు ఓ మాట గెలిచాక మరోమాట..
- ముఖ్యమంత్రిపై కేటీఆర్ విమర్శలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

దమ్ముంటే హరీశ్‌రావు సవాల్‌కు రేవంత్ రెడ్డి స్పందించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. రేవంత్ రెడ్డి తన సొంత జిల్లాలో గెలవడం కూడా కష్టమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేవంత్ రెడ్డిది మాట నిలుపుకున్న చరిత్ర కాదు.. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం అన్నాడు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా గెలుస్తామని చెప్పి ఓడిపోయిన తర్వాత మాట తప్పాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోసం పార్ట్ 1 జరిగింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మోసం పార్ట్ 2 కొనసాగుతోంది. ఎట్టి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి రుణమాఫీ చేయడు. నేతి బీరకాయలో నెయ్యి ఉండని తీరుగానే రేవంత్ రెడ్డి మాటల్లో నిజాయితీ ఉండదు. ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చిన పార్టీకే రేవంత్ రెడ్డి కట్టుబడి లేడు. ఆయన ఏ సవాల్‌కు కట్టుబడి ఉన్నాడో చెప్పాలె? అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### బీజేపీని ఎదుర్కొనే శక్తి ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉంది..

బీఆర్ఎస్ పార్టీ 10 12 స్థానాలు సాధిస్తే కేంద్రంలో రానున్న ప్రభుత్వంలో కీలకపాత్ర వహించే అవకాశం ఉంటుందన్నారు కేటీఆర్. ఎన్డీఏ, ఇండియా కూటమిలో లేకుండా కూడా సుమారు 13 పార్టీలు బయట ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు మాకు రాజకీయ ప్రత్యర్థులే. ఈ రెండు పార్టీలు చేసిన ద్రోహానికి దేశానికి ఎంతో నష్టం జరిగింది. అందుకే కాంగ్రెస్, బీజేపీలను తిరస్కరించి ప్రాంతీయ పార్టీలకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం. కాంగ్రెస్‌కు బీజేపీని ఎదుర్కొనే శక్తి లేదు... బీజేపీని ఎదుర్కొనే శక్తి ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉంది. బీజేపీని ఎదుర్కొనే శక్తి లేకనే రాహుల్ గాంధీ ఉత్తర భారతదేశం నుంచి కేరళకు పారిపోయిండు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఒత్తిడి చేసిన ఎదుర్కొని బీజేపీని తట్టుకుంటున్నది ప్రాంతీయ శక్తులే. ఒకనాడు ఎన్టీ రామారావు భారతదేశం అనే పార్టీ పెట్టాలనుకున్నాడు.

# ప్రభుత్వ ఉద్యోగి అవినీతి.. రాజ్య వ్యతిరేక నేరమే

## సుప్రీం కోర్టు

**విశాలభారతి,న్యూఢిల్లీ**



ప్రభుత్వ ఉద్యోగి చేసే అవినీతిని రాజ్యానికి, సమాజానికి వ్యతిరేకంగా చేసిన నేరంగానే చూడాలని సుప్రీం కోర్టు అభిప్రాయ పడింది. డబ్బులు తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని మోసం చేసిన నిందితులకు సంబంధించిన క్రిమినల్ కేసును సంబంధిత కక్షిదారుల మధ్య రాజీ కుదిరిందన్న కారణంతో మద్రాసు హైకోర్టు కొట్టి వేయడాన్ని సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం తప్పు పట్టింది.హైకోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టి నిందితులపై క్రిమినల్ ఫిర్యాదును మళ్లీ తెరవాలని ఆదేశించింది.డబ్బులతో ప్రభుత్వ ఉద్యోగాలను కొనేవారు తిరిగి ఆ మొత్తం సంపాదించడానికి అవినీతికి పాల్పడతారని దీంతో పరోక్షంగా ప్రజలు బాధితులు అవుతారని అందువల్ల ఇలాంటి కేసుల్లో నిందితులను ఉపేక్షించ కూడదని ధర్మాసనం పేర్కొంది.

- రెండు నెలల రియల్ ఎస్టేట్ వ్యాపారసరళి
- వెల్లడించిన నైట్ ఫ్రాంక్ నివేదిక
- బడ్జెట్ ఇండ్లకు పెరుగుతున్న ఆదరణ

# హైదరాబాద్ రియల్ ట్రెండ్ ఇదే



విశాలభారతి,
హైదరాబాద్ :
ఎన్నికలు కారణంగా హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్నరియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఆశించినంత ప్రచారం జరగడం లేదు. దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ అమ్మకాలు మందగిస్తే.. హైదరాబాద్ కేంద్రంగా స్టడీ అండ్ గ్రో అన్న తీరుగా సాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బడ్జెట్ ఇండ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష ఆదరణ వస్తుండటం, ఎన్నికల కారణంగా గతేడాది కంటే కేవలం 8శాతం మాత్రమే క్షీణించడం హైదరాబాద్ నగర రియల్ వ్యాపారానికి ఉన్న డిమాండ్‌ను స్పష్టం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. తాజాగా మార్చి – ఏప్రిల్ నెలలో జరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపార సరళిపై ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఓ నివేదికను వెల్లడించింది. హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగానికి విశేషమైన ఆదరణ ఉందని, భవిష్యత్తులో మరింత రెట్టింపు వేగంగా క్రయవిక్రయాలు జరుగుతాయని అంచనా వేసింది. ఈ క్రమంలో హైదరాబాద్ కేంద్రంగా విస్తరించిన రియల్ ఎస్టేట్ ట్రెండ్‌పై ఈ వారం విశాలభారతి రియల్ టాక్.

మెరుగైన మౌలిక వసతులు, అంతకు మించిన ఉద్యోగ ఉపాధి అవకాశాలతో రియల్ ఎస్టేట్ రంగానికి హైదరాబాద్ వేదికగా నిలుస్తున్నది. అయితే గత ఏడు నెలల కాలంగా రాష్ట్రంలో నెలకొన్న ఎన్నికల సందడి రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపుతుంది. దీని కారణంగా హైదరాబాద్‌లో రెసిడెన్షియల్, ఓపెన్ ప్లాట్ల క్రయవిక్రయాల్లో కొంత స్తబ్ధత నెలకొన్నది. కానీ గతేడాదితో పోల్చితే అమ్మకాల్లో ఉన్న వ్యత్యాసం స్వల్పంగానే ఉన్నట్లుగా నివేదికలో వెల్లడైంది. అదే సమయంలో గతేడాది కాలంగా హైదరాబాద్ నగర శివారు వరకు బడ్జెట్ ఇండ్లకు డిమాండ్ పెరుగుతున్నట్లుగా తేలింది. ప్రస్తుతం బిల్డర్లు, బడా వ్యాపార సంస్థలు లగ్జరీయస్, భారీ విస్తీర్ణంలో ఉండే రెసిడెన్షియల్ ప్రాజెక్టుల వైపు మొగ్గుచూపుతున్నారు. వీటినే నిర్మించేందుకు అత్యంత ప్రాధాన్యత నివ్వడంతో... క్రమంలో ఆఫర్డబుల్ ఇండ్ల లభ్యత తగ్గిపోతుంది. కానీ ఇప్పటికీ నగరంలో ఆఫర్డబుల్ ఇండ్ల కోసం చూస్తున్న కొనుగోలుదారులు ఉన్నట్లుగానే స్పష్టమైంది. మొత్తం అమ్మకాల్లో సగానికి పైగా ఆఫర్డబుల్ రేంజ్‌లో ఉండే రెసిడెన్షియల్ ప్రాజెక్టులే కావడం గమనార్హం.

## మార్చి అమ్మకాలు ఇలా...

### నైట్ ఫ్రాంక్ నివేదిక ప్రకారం నగరంలో మార్చి అమ్మకాలను పరిశీలిస్తే...

హైదరాబాద్‌లోని అన్ని రిజిస్ట్రేషన్‌లలో ఆఫర్డబుల్ రేంజ్‌లో ఉండే రూ. 25 - 50 లక్షల మధ్య ఉండే ఇండ్ల అమ్మకాల 45% వాటాను కలిగి ఉన్నాయి. అదేవిధంగా రూ. 25 లక్షల కంటే తక్కువ ధర ఉన్న ప్రాపర్టీల మొత్తం రిజిస్ట్రేషన్‌లలో 14% వాటాను కలిగి ఉన్నాయి. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలకు అనువైన బడ్జెట్ రేంజ్‌గా స్థిరపడిపోయింది. అయితే రూ. 1 కోటి లేదా అంతకంటే ఎక్కువ ధర ఉన్న ఆస్తుల విక్రయాలు మార్చి 2024లో 16%కి పెరిగింది. గతేడాది ఇదే సమయంలో 10శాతం లోపే ఉన్నట్లుగా పేర్కొంది. మార్చి 2024లో రిజిస్టర్ చేయబడిన ప్రాపర్టీలు ఎక్కువగా 1,000 2,000 చదరపు అడుగుల పరిధిలోని అపార్ట్‌మెంట్‌లే ఎక్కువగా ఉన్నాయి. ఇక వెయ్యి చదరపు అడుగుల లోపు ఉండే ప్రాజెక్టులకు ఉండే డిమాండ్ సాధారణంగానే ఉండగా... ఈ సెగ్మెంట్‌కి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు మార్చి 2023లో 20% నుండి 16%కి పడిపోయాయి. అయితే, రిజిస్ట్రేషన్‌లు పెరగడంతో 2,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ ఉన్న ఆస్తులకు డిమాండ్ మార్చి 2023లో 10% నుండి 2024 మార్చిలో 15%కి పెరిగింది. ఇక 3,000 చదరపు అడుగులు, రూ. 5 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఆస్తుల క్రయ విక్రయాలు మార్చి నెల్లో జరిగినట్లుగా వెల్లడింది. ఈ లెక్కన భారీ బడ్జెట్ ఇండ్ల కంటే ఆఫర్డబుల్ రేంజ్ సెగ్మెంట్‌లో ఉండే ప్రాజెక్టులకు ఏమాత్రం ఆదరణ తగ్గ లేదని, నగరంలో వీటికి డిమాండ్ పెరుగుతూనే ఉందని, ముఖ్యంగా కొత్తగా సొంతింటిని కొనుగోలు చేసేవారే ఈ తరహా ప్రాజెక్టులను కొనుగోలు చేస్తున్నట్లుగా నిపుణులు అంచనా వేస్తున్నారు.

### అగ్రగామిగా రంగారెడ్డి జిల్లా

ఇక జిల్లాల వారీగా జరిగిన రిజిస్ట్రేషన్లను పరిగణనలోకి తీసుకుంటే మార్చి 2024లో రంగారెడ్డి జిల్లా అగ్రగామిగా నిలిచింది, మార్కెట్‌లో 46% ఆక్రమించుకుంది. మార్చి 2023లో నమోదైన 34%తో పోలిస్తే భారీగానే వృద్ధి చెందింది. ఆ తర్వాతి స్థానంలో 40శాతం వాటాతో మేడ్చల్‌మల్కాజిగిరి, 14శాతం వాటాను హైదరాబాద్ జిల్లాలో కలిగి ఉంది. మార్చి 2024లో జరిగిన రెసిడెన్షియల్ ప్రాపర్టీల లావాదేవీలలో సగటు ధర 12% గణనీయంగా పెరిగింది. వార్షికంగా జరిగిన క్రయవిక్రయాల పరంగా మేడ్చల్‌మల్కాజ్‌గిరి 13% సంవత్సరానికిగాను, రంగారెడ్డి, హైదరాబాద్‌లో వరుసగా 8%, 3% పెరుగుదల నమోదైంది. గృహ కొనుగోలుదారులు పెద్ద, మెరుగైన సౌకర్యాలను అందించే ఖరీదైన ఇండ్లను కూడా కొనుగోలు చేశారు. 3,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ పరిమాణంలో, రూ. 5.3 కోట్లకు పైగా ఉండే ఆస్తుల క్రయవిక్రయాలు అన్ని కూడా రంగారెడ్డి జిల్లా పరిధిలోనే జరిగినట్లుగా తేలింది. ఇందులో మొదటి ఐదు స్థానాల్లో కొండాపూర్ నాలుగో స్థానంలో ఉండగా, ఒకటో స్థానంలో వెస్ట్ సిటీలోని కోకాపేటలో ఉంది.



### ఆరు వేల ప్రాజెక్టులు...

నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక ప్రకారం మార్చి 2024లో హైదరాబాద్ కేంద్రంగా 6,416 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే 8% క్షీణించిన, ఈ పరిస్థితి తాత్కాలికమేనని, ఎన్నికల ముగిసిన వెంటనే డబ్బు ప్రవాహం రియల్ ఎస్టేట్ రంగంలో పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో మార్చి నెలలో నమోదు చేయబడిన ఆస్తుల మొత్తం విలువ రూ. 4,039 కోట్లుగా ఉంది. ఇందులో 12% అధిక విలువ కలిగిన గృహాల విక్రయాలు కూడా ఉండటం విశేషం.

### శివారు జిల్లాలే హాట్ ఫేవరేట్...

హైదరాబాద్ కేంద్రంగా విస్తరించిన రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు శివారు జిల్లాలు హాట్ ఫేవరేట్‌గా మారుతున్నాయి. శరవేగంతో విస్తరిస్తున్న శివారు ప్రాంతాలు, అంతకు మించిన వేగంతో జరుగుతున్న అభివృద్ధి కారణంగా మార్కెట్‌లోకి నివాస యోగ్యత కలిగిన ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కోర్ సిటీపై భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా రూపొందిస్తున్న పారిశ్రామిక అభివృద్ధి ప్రణాళికలు శివారు ప్రాంతాలకు మరింత ఆదరణ వచ్చేలా చేస్తున్నాయి. ఇందులో ప్రధానమైన నగరం నలువైపులా పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు కారణంగా శివారుల్లోనే సిటీ తరహాలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోనుంది. ఇక నివాస మార్కెట్‌లో మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి మూడు జిల్లాల కేంద్రంగా ప్రాథమిక, ద్వితీయశ్రేణి రియల్ ఎస్టేట్ మార్కెట్ విస్తరిస్తున్నది.

### పెరుగుతున్న ధరలు...

హైదరాబాద్‌లోని రెసిడెన్షియల్ మార్కెట్ ముఖ్యంగా అత్యాధునిక గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. అదే సమయంలో ఆఫర్డబుల్ ప్రాజెక్టులలోనూ విక్రయాలు ఏమాత్రం తగ్గలేదని నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్ శిశిర్ బైజాల్ అన్నారు. కరోనా మహమ్మారి తర్వాత నగరంలో ధరలు స్థిరంగా పెరుగుతూనే ఉన్నాయని, ఇది మార్చి వరకు కొనసాగిందన్నారు. ఎక్కువ స్థలం, సౌకర్యాలను అందించే అధిక విలువ కలిగిన ఆస్తుల వైపు చూపే కొనుగోలుదారుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. మార్కెట్ మార్పులకు ప్రతిస్పందనగా డెవలపర్‌లు చురుకుదనం, అనుకూలమైన ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇక మారుతున్న కొనుగోలుదారుల అభిరుచులు, ప్రాధాన్యతలతో రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త పుంతలు తొక్కుతుందన్నారు.

### పెరిగిన డబుల్ బెడ్రూం ఇండ్లు

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ యొక్క 2024 మొదటి త్రైమాసికంలో అపార్ట్‌మెంట్ లాంచ్‌లలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కొనుగోలుదారుల ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని, డెవలపర్‌లు డబుల్ బెడ్రూం, త్రిపుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి మొగ్గు చూపారు. టూ బీహెచ్‌కే అపార్ట్‌మెంట్‌ల లాంఛింగ్‌లూ భారీగా పెరిగాయి. గత ఏడాది కాలంలో 23% నుండి 32%కి పెరిగింది. ఇంతలో త్రిపుల్ బెడ్రూం సెగ్మెంట్‌లోనూ స్థిరమైన డిమాండ్ కొనసాగుతుంది. మార్కెట్‌లో ఈ రెండు సెగ్మెంట్లే ప్రధాన వాటాను కలిగి ఉన్నట్లుగా వెల్లడైంది



# ఆదరిస్తే అండగా ఉంటాం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని, పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ కు జనం పట్టం కట్టడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 19వ వార్డులో భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు పర్యటించారు. స్థానిక కౌన్సిలర్ నారని కవిత శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రజలతో ముఖాముఖి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి గడ్డపై హస్తం జెండా ఎగరడం తథ్యం అని అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రచారంలో దూసుకెళ్తున్నారని, నియోజకవర్గం నుంచి అధిక మెజారిటీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ది పేదల ప్రభుత్వమని, పేదల అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధిక సీట్లు గెలిపించి రాహుల్ కి గిఫ్ట్ ఇస్తామని అన్నారు. భువనగిరిలో కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు పక్కా అన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ రెడ్డి సతీమణి డింపుల్ రెడ్డి, తల్లి అరుణ, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివ కుమార్, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి సుధాకర్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి. కాలనీ అధ్యక్షులు తిరుమల రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హయత్ నగర్ సీఐ గుడ్ వర్క్

- రాచకొండ సీపి తరున్ జోషి.



**నేరెడ్ మెట్, విశాలభారతి**: రానున్న ఎలక్షన్ లను దృష్టిలో ఉంచుకుని సక్రమంగా విధులు నిర్వహిస్తున్న హయత్ నగర్ ఇన్స్పెక్టర్ కి రివార్డ్ అందించారు. రాచకొండ సీపి తరున్ జోషి. ఎన్నికల భద్రతా ఏర్పాట్లలో తీసుకుంటున్న చర్యలలో భాగంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి విధులలో సమర్థవంతంగా పనిచేస్తున్న హయత్ నగర్ పోలీస్ స్టేషన్ సీఐ జి .రామకృష్ణను నేరెడ్మెట్ లోని సీపి ఆఫీస్ లో ఆయనను శనివారం అభినందించి రివార్డ్ అందించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్క పోలిస్టేషన్ ఇన్స్పెక్టర్ లు అందరూ మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు.





# రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులదే

- ప్రొ. యోగేంద్ర యాదవ్.
- ప్రొ. సుకుమార్ నారాయణ.

**సికింద్రాబాద్ ,విశాలభారతి:**ఉస్మానియా యూనివర్సిటీ లెఫ్ట్, దళిత బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో "భారతదేశంలో ప్రజాస్వామ్యం మరియు రాజ్యాంగ విలువలకు సవాళ్లు: పౌరులు, పౌర సంస్థల బాధ్యత" అనే అంశంపై ఆర్ట్స్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఆమంచి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ యాదవ్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొ. సుకుమార్ నారాయణ ముఖ్య వక్తలుగా విచ్చేసి ప్రసంగించారు. ప్రొ. యోగేంద్ర యాదవ్ మరియు ప్రొ. సుకుమార్ నారాయణ మాట్లాడుతూ. ప్రస్తుత భారత ప్రజాస్వామ్య పరిస్థితి గురించి ఆందోళనలు వ్యక్తం చేశారు. భారత గణతంత్రం పౌరులకు సామాజికఆర్థిక సమానత్వం అందించాల్సిన బాధ్యత గుర్తు చేశారు. భారత ప్రజాస్వామ్య రాజ్యాంగ విలువలను విచ్ఛిన్నం చేయడానికి అధికారంలో ఉన్నవారు చేసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛకు కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. సామాజికఆర్థిక అసమానతలను పరిష్కరించడానికి కుల గణన యొక్క అత్యవసర అవసరాన్ని నొక్కిచెప్పారు.

అంతేకాకుండా, ప్రజాస్వామ్యం యొక్క నిజమైన సారాంశం సమానత్వం, సంపద పంపిణీ, బలమైన ప్రతిపక్ష పార్టీలు , చట్టం యొక్క నిష్పాక్షికత మరియు రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండటమే అని ప్రజల సంక్షేమానికి సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం అనివార్యమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ లక్ష్యంగా జరిగే ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని వక్తలు పిలుపునిచ్చారు. అటువంటి ఉద్యమాలకు అవగాహన పెంచడంలో మరియు మద్దతు కూడగట్టడంలో సంప్రదాయ మరియు సోషల్ మీడియా కీలక పాత్రను వారు నొక్కి చెప్పారు.రాజ్యాంగాన్ని పరిరక్షించడం మరియు ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కుతాడి అర్జున్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ బీనవేని రామ్ షెపర్డ్, డాక్టర్ కొండా నాగేశ్వరరావు, డాక్టర్ సమున్నత, డాక్టర్ వంశీధర్ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు.. తుక్కు తుక్కే

- రఘురాం రెడ్డి కి భారీ విజయాన్ని అందిద్దాం
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పునరావృతం
- కొత్తగూడెం నియోజకవర్గ సమావేశంలో మంత్రి పొంగులేటి





**విశాలభారతి,కొత్తగూడెం:**

ఈ లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు తుక్కు తుక్కు కానుందని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డికి కేవలం కొత్తగూడెం నియోజకవర్గంలోనే లక్ష ఓట్ల మెజారిటీ అందిద్దామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం రాత్రి కొత్తగూడెంలో నిర్వహించిన కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ మాయమాటలు నమ్మి వివిధ పార్టీల నుంచి బీ ఆర్ఎస్లో చేరి అక్కడ ఇమడలేక కాంగ్రెస్లో చేరిన వారందరికీ శిరస్సు వంచి ఆహ్వానం పలుకుతున్నా అని.. అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన కాంగ్రెస్ అనుకూల ఫలితాలే.. లోక్ సభ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయని తెలిపారు. బీఆర్ఎస్ పాలకులకు గత పది సంవత్సరాల్లో ప్రజలు గుర్తు రాలేదని, వారి ప్రభుత్వం పడిపోయాకనే జనం ధ్యాస మొదలైందా అని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. రైతుల రుణమాఫీ గురించి మాట్లాడే నైతికత బీఆర్ ఎస్ కు లేదని, కొత్త ప్రభుత్వాన్ని విమర్శించడానికి కనీసం సిగ్గుండాలి అన్నారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణ జరుగుతుందని..గుణపాఠం తప్పదని తెలిపారు. మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే బీ జే పీ నీ నమ్మొద్దని అన్నారు. బీ ఆర్ఎస్, బీ జే పీ రెండూ ఒకటే అని విమర్శించారు.





# ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబురాలు

**మేడిపల్లి,విశాలభారతి:**బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీశ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ముఖ్యఅతిధిలుగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి, అధ్యక్షులు బండారి రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్ పార్టీ జెండా ఆవిష్కరించి గులాబీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా 1,6,7,13,14,19 డివిజన్లలో జరిగిన జెండా ఆవిష్కరణ వేడుకలో పాల్గొని అనంతరం పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా మల్కాజ్గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ....ఏప్రిల్ 27, 2001 నాడు తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పుట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, బంగారు తెలంగాణ నిర్మాణం కోసం పార్టీ అహర్నిశలు కృషి చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి, భారత రాష్ట్ర సమితిగా పరిణతి చెంది రైతుల కోసం, శ్రామికుల కోసం, కర్షకుల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం, పేద వర్గాల కోసం, వారి అభివృద్ధి కోసం.. పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లోనూ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుందని తెలిపారు. పదేళ్ల పాలనలో అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించి, పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కాంగ్రెస్,బీజేపి పార్టీలు అమలు కానీ హామీలను ప్రచారం చేసి ప్రజలకు మోసంచేస్తున్నాయని దుయ్యపట్టారు. రైతు భరోసా ఎకరాకు రూ. 15,000, కౌలు రైతులకు ఎకరాకు రూ. 15,000, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12,000, వరి పంటకు క్వింటాలుకు రూ. 500 బోనస్,18 ఏళ్ళు దాటిన మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఇయ్యలేదు.ఆసరా పెన్షన్ రూ. 4000 కు పెంచుతామన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.4000 ఇస్తామన్నారు. 24 గంటల కరంటు ఇస్తామన్నారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.200 యూనిట్ల వరకు కరంటు ఫ్రీ అన్నారు, రూ. 500 కు గ్యాస్ సిలిండర్ ఇస్తా అన్నారు.ఇందులో ఏది కూడా అమలు చేయడం లేదు. కాబట్టి దొంగ హామీలు ఇచ్చి మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపి పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, కౌడే పోచయ్య, ఏనుగు మనోరంజన్ రెడ్డి,బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, జావీద్ ఖాన్,జగన్, వెంకన్న,మల్లం వెంకటేష్ గౌడ్,జిలాని పాషా, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, ఉద్యమ కారులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# సంపూర్ణ ఆరోగ్యంకై వేసవి క్రీడల శిక్షణలో పాల్గొనండి

- డిప్యూటీ కమిషనర్ యాదగిరిరావు

**సికింద్రాబాద్ ,విశాలభారతి:**విద్యార్థిని విద్యార్థులు యువత సంపూర్ణ ఫిట్ నెస్ కోసం జిహెచ్ఎంసి నిర్వహిస్తున్న వేసవి క్రీడల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని జిహెచ్ఎంసి అడిషనల్ డిప్యూటీ కమిషనర్ యాదగిరి రావు సూచించారు. శనివారం ఉదయం తార్నాక డివిజన్ లాలాపేట ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో ఆయన సికింద్రాబాద్ జోన్ స్పోర్ట్స్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాస్ గౌడ్ తో కలిసి వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . సంపూర్ణ ఆరోగ్యంతోనే జీవితంలో అన్ని సాధ్యమని కాబట్టి విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని తమకిష్టమైన ఆటల్లో రాణించాలని దానికి మా కోచ్ లు సలహాలు సూచనలు అందజేయనున్నట్టు యాదగిరిరావు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయనకు స్టేడియంలో ఉన్న పలు వివిధ క్రీడలకు సంబంధించిన రూమ్స్ కెళ్ళి శిక్షణను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక వాకర్స్ గ్రౌండ్లో ఉదయం సమయంలో వాటర్ తో క్యూరింగ్ చేపించాలని మరియు గ్రౌండ్ నిర్వహణను గాడిలో పెట్టాలని సూచించారు . మరొకవైపు బ్యాట్మెంటెన్ క్రీడాకారులు తన సమస్యలను తీర్చాలని ఆయన మొరపెట్టుకున్నారు. సమస్యలు 4 రోజుల్లో పరిష్కరించనున్నట్టు అయిన హామీ ఇచ్చారు. అనంతరం జిహెచ్ఎంసి సికింద్రాబాద్ సర్కిల్ గేమ్స్ ఇన్స్పెక్టర్ కే. శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ. ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు ఈ వేసవి శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడానికి గ్రౌండ్లో ఉండే సంబంధిత క్రీడ కోచ్ కలిసి 10 రూపాయల నామమాత్రపు ఫీజుల చెల్లించి క్రీడలలో పాల్గొనాలని , ఇగ బ్యాట్మెంటెన్ కోసం 50 రూపాయలు చెల్లించాలని సూచించారు. నేటి నుండి ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన చెప్పారు. జిమ్నాస్టిక్ , బాక్సింగ్ , కరాటే , క్రికెట్ , షటిల్ బ్యాట్మెంటెన్ , లాంటి క్రీడలలో వేసవి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు , వాకర్స్ , గ్రౌండ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించలని , వారి దృష్టికి తీసుకువెళ్లారు. రానున్న 4 రోజుల్లో సంబంధించిన క్రీడా మెటీరియల్స్ అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం సూపర్వైజర్ కే. రాజేష్ వివిధ క్రీడల కోచులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అయోధ్య అక్షింతల పంపిణీని అవమానించారు

- కేసీఆర్ పై ఎన్నికలల్లో నిషేధం విధించాలి
- ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చూడాలి
- విశ్వహిందు పరిషత్ డిమాండ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

అయోధ్య రామజన్మభూమి ఉత్సవాలను అవమానించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఆయనపై నిషేధం విధించాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కు విశ్వహిందు పరిషత్ నేతలు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన భువనగిరి రోడ్ షోలో కేసీఆర్ అయోధ్య అక్షింతల పంపిణీ, తీర్థప్రసాదాల వితరణ, కాషాయ జెండాలతో నిర్వహించిన శోభాయాత్రలను అవహేళన చేసేలా, అవమాన పరిచేలా మాట్లాడారని విశ్వహిందు పరిషత్ రాష్ట్ర సహ కార్యదర్శి రావినూతల శశిధర్ పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా హిందువుల విశ్వాసాలు కించపరుస్తున్నారని, అందుకే ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొనకుండా నిషేధం విధించాలని కోరారు. వికాస్ రాజ్ కు ఫిర్యాదు చేసిన వారిలో విశ్వహిందు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ మూర్తి, మఠమందిర్ విభాగ్ జాతీయ సంయోజకుడు రామరాజు, రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, నగర కార్యదర్శి వీరేశలింగం ఉన్నారు.

# టెట్ పరీక్షను వాయిదా వేయండి

**ఎన్నికల కమిషన్‌కి అభ్యర్థుల లేఖలు**

**విశాలభారతి,హైదరాబాద్:**




టెట్ పరీక్షా వాయిదా వేయించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు టెట్ అభ్యర్థులు శనివారం లేఖలు రాసారు . మే 27 న నల్గొండ వరంగల్ ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ ఉందని , అదే రోజు టెట్ పరీక్ష నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు . ఈ పరిస్థితుల కారణంగా టెట్ పరీక్షలు వాయిదా వేయింఛాలని విజ్ఞప్తి. పోలింగ్ తేదీన టెట్ పరిక్ష వుండటం మూలాన దాదాపు 70 వేల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు . రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 న టెట్ నోటిఫికేషన్ విడుదల చేశారని , మే 20 నుండి జూన్ 3 వరకు ఆన్ లైన్ విధానం లో టెట్ నిర్వహిస్తామని తెలిపారని పేర్కొన్నారు . పరీక్షల పూర్తి షెడ్యూల్ ఇంకా ఇవ్వలేదని మే 20 నుండి జూన్ 3 వరకు అని తెలిపారు. వేలాది మంది అభ్యర్థులు హైద్రాబాద్ , ఇతర రాష్ట్రాల్లో కోచింగ్ లొ ఉన్నందున ఓటు వేయుటకు ప్రయాణ సమయం దృష్టిలో పెట్టుకొని టెట్ పరీక్షలను వాయిదా వేయించాలని కోరారు . ఎన్నికల కొడ్ ఉల్లంఘన కిందకు టెట్ వస్తునందున టెట్ పరీక్షలను వాయిదా వేయించాలని రాష్ట్ర టెట్ అభ్యర్థులు, తెలంగాణ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్లు విజ్ఞప్తి చేసారు .

# నేటి నుంచి ఇంటింటికీ బీజేపీ

**30వ తేదీ వరకు కార్యక్రమం**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ బూత్ విజయ్ అభియాన్(ఇంటింటికీ బీజేపీ) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమాన్ని ఇప్పటికే తొలి విడుత పూర్తయింది. కాగా రెండో విడుత ఆదివారం నుంచి ఈనెల 30 వరకు మూడ్రోజుల పాటు కొనసాగనుంది. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలిసేలా పార్టీ ప్లాన్ చేసుకుంది. రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్ లలో ప్రతి ఇంటికీ వెళ్లి సంకల్ప పత్రాన్ని అందించాలని రాష్ట్ర నాయకత్వం సూచించింది. దీంతో పాటు ఆయా పార్లమెంట్లలో పోటీ చేస్తున్న అభ్యర్థి కరపత్రంతో పాటు స్టిక్కర్ ను అందజేయనుంది. ప్రతి పోలింగ్ బూత్ లో కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించాలని రాష్ట్ర నాయకత్వం కార్యకర్తలకు దిశానిర్దేశం చేసింది.

# నేటితో పాలిసెట్ గడువు ముగింపు

**విశాలభారతి,హైదరాబాద్ :**





రాష్ట్రంలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, వెటరర్నరీ, ఫిషరీస్ తదితర డిప్లొమా కోర్సుల్లో 202425 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ దరఖాస్తు ఆదివారంతో ముగియనుందని అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్ష రాసిన, పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా రూ.100 లేట్ ఫీజుతో ఈనెల 30 వరకు దరఖాస్తులకు చాన్స్ ఇచ్చినట్లు తెలిపారు. రూ.300 ఆలస్య రుసుముతో మే 20 వరకు అవకాశం కల్పించినట్లు స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా పాలిసెట్ పరీక్ష మే 26వ తేదీన నిర్వహించనున్నారు. ఇతర వివరాలకు http://polycet.sbtet.telangana.gov.in వెబ్ సైట్ సంప్రదించాలని తెలిపారు.

# మైనారిటీలను కాంగ్రెస్ రెచ్చగొట్టుతుంది

- కశ్మీర్ భూభాగాన్ని పాక్ ఆక్రమించింది
- హిందువులపై విషం చిమ్ముతున్నారు
- ప్రతిపక్షాలు నోరు మెదపడంలేదు
- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



కాంగ్రెస్ వల్లే పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ఏర్పడిందని, కశ్మీర్ భూభాగాన్ని పాక్ అక్రమంగా ఆక్రమించిందని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శలు చేశారు. హైదరాబాద్ లో శనివారం నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మైనారిటీలను రెచ్చగొట్టి ఓట్లు దక్కించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శలు చేశారు. కాంగ్రెస్.. మెజారిటీ వర్గాలను కించపరుస్తూ మాట్లాడుతోందని ఫైరయ్యారు. మోడీ ఎక్కడా కుల, మత ప్రస్తావన తెలేదన్నారు. ముస్లిం సంతుష్టీకరణ కాంగ్రెస్ డీఎన్ఏలో ఉందని ఆయన పేర్కొన్నారు. హిందువులపై విషం చిమ్ముతూ దేవుళ్ళను అవమానపరుస్తుంటే విపక్షాలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రామ మందిర నిర్మాణాన్ని కాంగ్రెస్ అడుగడునా అడ్డుకుందన్నారు. బీసీ ఏలో ముస్లింలు రిజర్వేషన్లు పొందుతున్నారని లక్ష్మణ్ అన్నారు. మళ్ళీ ప్రత్యేక కోట కింద 4 శాతం ముస్లిం రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని వెల్లడించారు. బీసీల వాటాను ముస్లింలు తన్నుకుపోతున్నారని తెలిపారు. రేవంత్ ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులు కాలరస్తూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని లక్ష్మణ్ విమర్శలు చేశారు. మత ప్రాతిపదిక రిజర్వేషన్లను రాజీవ్ గాంధీ వ్యతిరేకించారని, ఈవిషయాన్ని రాహుల్ గాంధీ తెలుసుకోవాలన్నారు. దేశ వనరులు ముస్లింలకు దక్కాలని గత ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారని, దేశ సంపదను ఎవరికి దోచి పెట్టాలని చూస్తున్నారని ఆయన ప్రశ్నించారు. శ్యాం పిట్రోడ 55 శాతం సంపద తీసుకొని ఎవరికి దోచి పెట్టాలని అనుకుంటున్నారన్నారు. రాజ్యాంగం మార్చే ప్రసక్తే లేదని, దీనిపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోందని విమర్శలు చేశారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తొలగించేది లేదన్నారు. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు జనగణన చేయలేకపోయిందనిన ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా రిజర్వేషన్లను అమలు చేస్తున్నది కాంగ్రెస్ అని ఫైరయ్యారు. బాబ్రీ మసీద్ నిర్మించుకోవాలని భూమి కూడా కేటాయించారని, వారు నిర్మించుకుంటామంటే అడ్డుకునేదెవరని లక్ష్మణ్ ప్రశ్నించారు. మోడీ పాలనను జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలకు పూనుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగ సంస్థలపై కమ్యూనిస్టులకు నమ్మకం లేదన్నారు. చైనా సిద్ధాంతాన్ని నమ్ముకున్నందుకే కమ్యూనిస్టులు ఇక్కడ అస్తిత్వాన్ని కోల్పోయారని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఎందుకు రేవంత్ రెడ్డి సమగ్ర విచారణ జరిగేలా చూడటం లేదని లక్ష్మణ్ ప్రశ్నించారు. మెడకాయ మీద తలకాయ లేనివారే కాంగ్రెస్, బీజేపీ ఒక్కటని ప్రచారం చేస్తారని లక్ష్మణ్ మండిపడ్డారు.



## జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

**ఆర్మూర్, విశాల భారతి** నందిపేట కేంద్రంలో గల సాయిబాబా ఫంక్షన్ హాల్ లో నందిపేట్, డొంకేశ్వర్ మండలాల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరడం జరిగింది. జీవన్ రెడ్డి వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన మంచినేతకావున గెలిపించుకుంటే మన నిజామాబాద్ పార్లమెంట్ కి ,ఆర్మూర్ నియోజకవర్గానికి ఎన్నో నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తాడని అన్నారు.ప్రతి బూతులో ముఖ్య నాయకులు అందరూ కూడా పనిచేసి అత్యధిక మెజార్టీ ఇచ్చి జీవన్ రెడ్డిగెలుపులో భాగస్వామ్యం కావాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందిపేట్ మండల అధ్యక్షులు మంద మహిపాల్, డొంకేశ్వర్ మండల అధ్యక్షులు గోడిసేరం భోజరెడ్డి, సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర పటేల్ తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ ఖ్యాతిని నిలబెట్టింది బిఆర్ఎస్ పార్టీనే

■ మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి విశాల భారతి ::** తెలంగాణ ఖ్యాతిని, తెలంగాణ పున: నిర్మాణ భవిష్యత్ కోసం పుట్టిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ అని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ భవన్ లో పార్టీ జెండాను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రెండు దశాబ్దాల పైచిలుకు పార్టీ ప్రస్థానంలో ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ పనిచేస్తుందన్నారు. గులాబీ దళపతి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నేతృత్వంలో చేసిన సంక్షేమ పథకాలను ప్రపంచ దేశాలు తెలంగాణ వైపు చూసాయన్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ, రైతుబంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, కెసిఆర్ కిట్టు, తెలంగాణ పండగల ప్రతీక కు దుస్తుల పంపిణీ, వినూత్న పథకాలతో ప్రజలకు అందించామన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, బి లక్ష్మయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## గడ్డి వాము దగ్ధం

**బాల్కొండ, విశాల భారతి:** గడ్డి వాము దగ్ధమైన ఘటన భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భీమ్‌గల్ పట్టణంలోని కర్నేగల్లికి చెందిన కొట్టాల నర్సయ్య బడా భీంగల్ బైపాస్ రోడ్డు సమీపంలో పశువుల కోసం గడ్డి వామును నిల్వ చేసుకున్నాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పోగ తాగి పడి వేయడంతో గడ్డి వాముకు ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. ఇది గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.సుమారు రూ.15 వేల నష్టం వాటిల్లిందని అన్నారు. పశువుల కోసం నిల్వ చేసుకున్న గడ్డి దగ్ధం కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.



## బాజిరెడ్డి గోవర్ధన్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**ఆర్మూర్, విశాల భారతి** బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజీరెడ్డి గోవర్ధన్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. శనివారం నిజామాబాద్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నందిపేట్ మండలంలోని వెల్మల్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలిపిస్తామని ఓటర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెల్మల్ రాజన్న, గాదారి శ్రీధర్, కేజీ సురేష్, దారం సురేష్, యువజన నాయకులు శుబాకర్ తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యత ప్రమాణాలతో ప్రజల్లో మమేకమవ్వాలి

■ ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి

**వనపర్తి విశాల భారతి::**ప్రజల్లో మమేకమై, నాణ్యత ప్రమాణాలు పాటించి బిజినెస్ లో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ సమీపంలో గ్రేడ్ వన్ మర్చంట్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజినెస్ చేసే ప్రతి ఒక్కరూ ప్రజల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, ప్రజల్లో మనం గుర్తింపు తెచ్చుకున్నప్పుడే మనం చేసే ప్రతి చిన్న వ్యాపారమైన ముందుకు సాగుతుందన్నారు. ఎప్పుడు లాభాలు పరమావధిగా పెట్టుకోకుండా, నాణ్యత ప్రమాణాలు కలిగి వ్యాపారాలు కొనసాగిస్తే మున్ముందు వ్యాపారాలు ముందుకు సాగుతాయి అన్నారు. అంతకుముందుకు గ్రేడ్ వన్ మర్చంట్ నిర్వాహకుడు మహమ్మద్ ఖలీల్ ఎమ్మెల్యే కు శాలువాతో సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర చందర్, రవి యాదవ్, గంధం దినేష్ తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

■ ముత్యాల సునీల్ కుమార్

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. బాల్కొండ మండలం నాగపూర్ గ్రామ లిఫ్ట్ కమిటీ చైర్మన్ సరికెల చిన్నయ్య, వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సంఘం బహరైన్ మాజీ అధ్యక్షులు సామ చిన్న రాజారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జంగం,హాజీ అలాల్,అశోక్,చింతకుంట భాస్కర్, మలాల్ తిరుపతి,సుద్దపల్లి చిన్నయ్య, గాదేపల్లి సాయిరాం నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.చేరిన వారందరికీ జీవన్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చేరిన వారికి ముత్యాల సునీల్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చు



**వనపర్తి విశాల భారతి:**పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని, ఆ లక్ష్యంతో ముందుకు వెళితే విజయం వరిస్తుందని శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు పూరి సురేష్ శెట్టి, సేవా సమితి ఫౌండర్ పూరి చంద్రకళ అన్నారు. వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన సానియా ఇంటర్ ఒకేషనల్ పరీక్షల్లో 1000/960 మార్కులతో జిల్లా ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం ఆమెను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద కుటుంబంలో జన్మించిన సానియా కష్టపడి చదువుకొని ర్యాంకు సాధించడం హర్షనీయమని చెప్పారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. పేద విద్యార్థులకు భవిష్యత్తులో శ్రీ వాసవి సేవా సమితి ద్వారా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.



## నాలుగు నెలల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశాం

■ ఆగస్టు 15 లోపు రైతులకు రుణమాఫీ చేస్తాం

**బాల్కొండ,విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసామని అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించే విధంగా కృషి చేస్తున్నామని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలోని దూదిగాం, మెండోర, రెంజర్ల, ఏర్గట్ల, కమ్మర్ పల్లి, మోర్తాడ్ గ్రామాల్లో నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని,ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక లోటును పూడుస్తూ క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని అన్నారు. ఆగస్టు 15లోపు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ఇది వరకే ప్రకటించారని అన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండి మచ్చలేని నాయకుడు,రైతు పక్షపాతి జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. అనంతరం నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం ద్వారా 150 రోజుల పని దినాలు కల్పిస్తూ రోజుకు కనీస వేతనం రూ.400 వచ్చే విధంగా ఏడాదికి 40వేల ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే కులగణన కూడా చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి,మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించండి

■ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**సిరికొండ, విశాల భారతి** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జీవన్ రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రజలను కోరారు. సిరికొండ మండల కేంద్రంలోని చీమన్ పల్లి, పందిమడుగు, పాకాల,కొండాపూర్, ముషీర్నగర్ గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన నిజామాబాద్ తో పార్లమెంట్ పరిధిలో వ్యవసాయం పైననె ఆధారపడివున్నారని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఎంపీ అభ్యర్థిగా జీవన్ రెడ్డిని గెలిపిస్తే సీఎం రేవంత్ రెడ్డి మొన్న నిజామాబాద్ మీటింగ్ లో కేంద్ర వ్యసాయ శాఖ మంత్రిగా పదవికి సోనియా, రాహుల్ గాంధీని ఒప్పించుకుంటానని ఆయన అన్నారని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఈ ప్రభుత్వ హయములోనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రంలో డీసీసీబీ ప్రధాన కార్యదర్శి భాస్కరెడ్డి, ఉమ్మాజీ నరేష్, ఎర్రన్న,బాకారం రవి,కుందేళ్ల శ్రీనివాస్, సిరికొండ మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాలుగోన్నారు.



## ఓటు ప్రజాస్వామ్యానికి కీలకమైన ఘట్టం

**వనపర్తి విశాల భారతి:**ప్రజాస్వామ్య పరిరక్షణకై ఓటరుకు తన బాధ్యతలను గుర్తుచేయడానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ సూచనల మేరకు వనపర్తి జిల్లాలో మెగా ర్యాలి నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్ ఆదేశించారు. ఏప్రిల్ 29వ తేదీన సాయంత్రం 5.30 నుండి దాదాపు 5000 మందితో మెగా ర్యాలీ నిర్వహించేందుకు అనుసరించాల్సిన వ్యూహం పై తన ఛాంబర్ లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం సాయంత్రం 5.30 నుండి మూడు ప్రాంతాల నుండి ఏక కాలంలో 3 ర్యాలీలు ఏర్పాటు చేయాలని మూడు ర్యాలీలు సాయంత్రం 6.00 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కలిసే విధంగా ప్రణాళికలు చేయాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఓటరు రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని అదే సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా తనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి పారదర్శక ఎన్నికల నిర్వహణకు సహకరించే విధంగా ప్రజలను అవగాహన కల్పించాలనేది ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు అందరూ పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం బాచాన్ పల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి,బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో వన్నెల జనార్ధన్,తిక్క బలరాం, మల్లేష్, గంగాధర్, సొసైటి డైరెక్టర్ గాండ్ల బాలయ్య, గంగాధర్, శంకర్, రాజన్న తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోదిరే స్వామి,పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య,డిసిసి డెలిగేట్ కుంట రమేష్, క్రాంతి, పృథ్వీరాజ్,రమేష్, పల్లె శేఖర్, కోరాడి రాజు,కోరాడి లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



## రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలి

■ మల్లు రవి గెలిపే లక్ష్యంగా కృషి చేయాలి..

■ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి విశాల భారతి::** నాగర్ కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బలపరిచిన మల్లు రవిని గెలిపించుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాహుల్ గాంధీకి బహుమతిగా ఇవ్వాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కార్యకర్తల ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో బాల్ నగర్, ఇందిరా కాలనీ, గాంధీనగర్, శనివారం రెండవ రోజు మార్నింగ్ వాక్ లో (గుడ్ మార్నింగ్ వనపర్తి) కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింట ప్రచారంలో భాగంగా ప్రతి కార్యకర్తను తట్టి కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివరించారు. నాగర్ కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని అత్యధిక మెజారిటీతో గెలిపించి మన పాలమూరు ముద్దుబిడ్డ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బహుమతిగా ఇవ్వాలని అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపిస్తే మన రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతాడని భీమా వ్యక్తం చేశారు. ఈ మార్నింగ్ వాక్ లో వనపర్తి పట్టణ అధ్యక్షులు వనపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మున్సిపల్ కౌన్సిలర్స్ కో ఆప్షన్ నెంబర్స్, మాజీ కౌన్సిలర్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళ మత్స్యకార సోషల్ మీడియా యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ సేవాదళ్ అన్ని వార్డుల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సిరెడ్డి



**దేవురుప్పల, విశాలభారతి:** అప్పిరెడ్డిపల్లి గ్రామంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య ద్వితీయ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సి రెడ్డి. అనంతరం ఇటీవల రాష్ట్రపతి గారి చేతులమీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా గడ్డం సమ్మయ్యని అభినందించిన ఝాన్సిరెడ్డి. వారి వెంట మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, సీనియర్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, మోలుగూరి రమేష్, రెడ్డి రాజుల రమేష్, దావేర అనిల్, చంద్ర మౌళి, యాకన్న,వెంకన్న, రాజేందర్, మండల, గ్రామ పార్టీ శ్రేణులు, తదితరులున్నారు.




# కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు హైకోర్టు షాక్

- ఫోర్జరీ పత్రాలతో కాలేజీ అనుమతి పొందారని ఓయూ జాక్ నేత ఫిర్యాదు
- నాలుగు వారాలలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశం

**కోదాడ, విశాలభారతి:** కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు ఫోర్జరీ పత్రాలతో అనుమతులు పొందారని, దీనిపై తాను ఢిల్లీలోని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ లోని జె ఎన్ టి యు కి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని కోదాడకు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ జెఏసి నాయకుడు డాక్టర్ భట్టు శ్రీహరి రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటీషన్ 8843/24 పై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఫిర్యాదు దారుడు చేసిన ఆరోపణలపై ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ లోని జెఎన్టియు నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసి నాలుగు వారాలలోగా తగు చర్యలు తీసుకోవాలని, అంత వరకు కళాశాలకు ఎటువంటి అనుమతులను పొడగించవద్దని కోర్టు తన ఆదేశాలలో పేర్కొంది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కోదాడలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇతరుల భూమిని తనదిగా చూపడంతో పాటు, ఆర్డీఓ సంతకాన్ని ఫోర్జరీ చేసి నాలా కన్వర్షన్ సర్టిఫికెట్ పొందినదని దీనిపై చర్యలు తీసుకోవాలని ఓయూ జెఏసి నేత జె ఎన్ టి యు కి ఫిర్యాదు చేసాడు. దీనిపై యూనివర్సిటీ నిపుణుల కమిటీ ఏర్పాటు చేయడంతో వారు లెటర్ నెంబర్ : డిఏఎఫ్ఏ / కిట్స్ డబ్ల్యుసీ / క్యూయు / కంప్లైంట్ / 2023 తేదీ 04 0923 న నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో కళాశాల యాజమాన్యం తమదని చెపుతున్న డాక్యుమెంట్ నెంబర్ 9307/2007 కు సంబంధించి యాజమాన్యపు హక్కుల పత్రాలతో పాటు, దీనికి ఆర్డీఓ ఇచ్చిన నాలా సర్టిఫికెట్లను సమర్పించడంలో విఫలమైందని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా దీనిని సేకరించిన భట్టు శ్రీహరి దీనిపై చర్యలు తీసుకోవాలని ఏఐసీటియు, జె ఎన్ టి యు లకు 170224 న ఫిర్యాదు చేశాడు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలను విద్యార్థులు ఎంచుకోవాలి

- అనుభవజ్ఞులైన అధ్యాపకులచె బోధన
- ఉచితంగా దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్ రిజిస్ట్రేషన్

**మరిపెడ, విశాలభారతి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు చేరాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత ఆదేశానుసారం లెక్చలర్లు ఇంటర్ పాసైన విద్యార్థుల తల్లితండ్రుల ఇంటికెళ్లి కరపత్రం అందజేసి ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఆహ్వానించారు. కళాశాలలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఉచితంగా దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్ రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి వెంకన్న,టి లక్ష్మ,ఎస్ కే యాకుబ్, వీరన్న పాల్గొన్నారు.




# 138వ మే డేను జయప్రదం చేయండి

- మేడే జెండాను వాడవాడలా ఎగరవేయాలి
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులునల్లు సుధాకర్ రెడ్డి

**కురవి, విశాలభారతి**: శ్రామిక కార్మిక వర్గాలు సంఘటితంగా కార్మికుల హక్కుల దినోత్సవం మేడే రోజున వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేసి శ్రమజీవులు ఐక్యతను చాటాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో మేడే గోడ పత్రికలను ఆవిష్కరించిన సందర్భంగా నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర భారతంలో కార్మిక వర్గాలు సుదీర్ఘ కాలంగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సమూలంగా రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చిన సందర్భంలో సిపిఐ ఏఐటియూసిలు మేడే సందర్భంగా వాడవాడలా ఎర్రజెండాలను ఎగరేసి శ్రమజీవుల ఐక్యతను చాటుతూ, బిజెపి ప్రభుత్వానికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి శ్రామిక కార్మిక వర్గాల అనుకూలమైన ఇండియా కూటమిని అభ్యర్థులను గెలిపించాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న నాయకులు మారగాని బాలకృష్ణ, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, పోలేపాక వెంకన్న,బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, రవి, అప్పల వెంకన్న, నర్సింగ్గం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోరిక బలరాం నాయక్ గెలుపుకై సైనికుడులా పని చేయాలి

- కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఉపేందర్



**కురవి, విశాలభారతి:** బంగారి గూడెం గ్రామ పంచాయతీ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉపేందర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్ చేతి గుర్తుకు ఓటు వేయాలని గ్రామ పార్టీ అధ్యక్షులు ఉపేందర్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా బంగారి గూడెం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఉపేందర్ నాయక్ మాట్లాడుతూ... మహాలక్ష్మి పథకం తో మహిళ సాధికారిత కోసం పాటు పడిన పార్టీ కాంగ్రెస్ అని ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో 6 గ్యారంటీ పథకాలు అమలు చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అదే విధంగా, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. అంతే కాకుండా ఈ యొక్క గెలుపుకై ప్రతి కార్యకర్త సైనికుడై పని చేసి గెలిపించుకొని కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటిదో చూపించాలని ఆయన కార్యకర్తలను కోరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా పనిచేసిందో గ్రామ ప్రజలకు రాష్ట్ర ప్రజలకు తెలిసిందే, అందుకే మన కార్యకర్తలు అందరూ ఒక తాటిపై వచ్చి మన పోరిక బలరామ్ నాయక్ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు.






# ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- ప్రభుత్వ క్యాంపు ఆఫీసులో పాస్టర్లతో సమావేశం
- బీఆర్ఎస్ కు మద్దతివ్వాలని ప్రార్థనలు
- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి
- ఈసికి పిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

**పటాన్ చెరు,విశాలభారతి:** ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ పటాన్ చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాస్టర్లతో సమావేశం నిర్వహించారని ఐఎన్టియుసి జిల్లా ప్రెసిడెంట్, పటాన్ చెరు టౌన్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి అధ్వర్యంలో ఎన్నికల అధికారికి పిర్యాదు చేశారు.

**భారత ఎన్నికల కమిషన్ అధికారికి సైతం మెయిల్ ద్వారా పిర్యాదు చేసారు.**

ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని చర్చి పాస్టర్లతో ప్రార్థనలు నిర్వహించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని లేఖలో పేర్కొన్నారు. మతాల వారిగా సమావేశాలు నిర్వహించి ప్రమాణం వేయించి ఎన్నికల్లో లబ్ది పొందాలని చూడడం సరికాదని తెలిపారు. మే 4న పాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి క్రిస్టియన్లను మభ్యపెట్టడంతో పాటు ఈద్ ఉల్ మిలాప్ కార్యక్రమం ద్వారా ముస్లింలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. మతాల ద్వారా ప్రజల సెంటిమెంట్లను అడ్డం పెట్టుకుని పార్లమెంట్ ఎన్నికల్లో లాభపడలని చూడడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పై చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్నికలు అయ్యే వరకు పార్లమెంట్ పరిధిలో ప్రచారంలో పాల్గొనకుండా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి సామయ్యా,పట్టణ కార్యదర్శి అబ్బుల్ల పాషా, ఏఐటీయూసీ కార్యదర్శి ప్రసాద్, ఎట్టయ్య, హామీద్, రమేష్, రవి, సాయిలు, ఆసిఫ్, సునంద, జ్యోతి, వెంకట్రావ్, కిషన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# మండే ఎండలతో ఎండుతున్న గొంతులు

- ప్రజలు విన్నవించిన పట్టించుకోని అధికారులు
- తక్షణమే సమస్యను పరిష్కరించాలి
- న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి సక్రు



**గార్ల, విశాలభారతి:** కిష్టాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అంజనాపురం గ్రామం గుడి సెంటర్ బజార్లో గత మూడు నెలల నుండి మిషన్ భగీరథ పంపులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని వేసవికాలం కావడంతో త్రాగునీరు లేక మరి అంత ఇబ్బంది లకు గురవుతున్న అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తక్షణమే ఆ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ బజారులో ఉన్న ఒక బోరు చెడిపోయి నెలలు గడుస్తున్న బాగు చేసిన పాపాన పోలేదని దీనితో ఒక రైతు బుంగ బావిలో తోడవడం వల్ల ఆ రైతు మాకే నీళ్లు సరిపోటంలేదని ఎవరికి రానీయకుండా ఉండడంతో మరి అంత ఇబ్బంది అయి సుదూర ప్రాంతాలకు వెళ్లి మంచినీరు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిదని తక్షణమే అధికారులు ఆ గ్రామానికి వెళ్లి మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే రోడ్డుకు అడ్డంగా మరియు గత నాలుగు రోజుల క్రితం వడగండ్ల వర్షంతో కరెంటు స్తంభానికి ఉన్న తీగలు తెగిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ కరెంటు అధికారులు పట్టించుకోవడం లేదని తక్షణం ఆ కరెంటు సమస్యను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియపరచడం జరిగింది. సమస్య పరిష్కరించిన నెలల ప్రజా ఆందోళనకు పూలుకోవాల్సి ఉంటుందని తెలియపరుస్తున్నాముఈ కార్యక్రమంలో పీవెల్ మండల కార్యదర్శి బి మంగీలా మరియు చిన్న బాబు సింగ్ రవి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ లో చేరిన నూతనకల్ జడ్పీటీసీ

- కందాల దామోదర్ రెడ్డి

**నూతనకల్, విశాలభారతి:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు , నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి నూతనకల్ మండల జడ్పిటిసి, బీఆర్ఎస్ నాయకులు కందాల దామోదర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. నూతనకల్లు మండల కేంద్రానికి చెందిన 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ మాట్లాడుతూ కందాల దామోదర్ రెడ్డి తో తెలంగాణ ఉద్యమ సమయంలో కలిసి పనిచేసిన అనుభవాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కి అత్యధిక మెజార్టీ ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూ, అదే విధంగా భువనగిరిలో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరడమైనది. అదేవిధంగా చిల్పకుంట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ తరపున జడ్పిటిసి కందాల దామోదర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ బాణాల సుదర్శన్ రెడ్డి,నూతనకల్లు మండల ప్రధాన కార్యదర్శి బత్తుల నాగములు, ఎస్సీ సెల్లు అధ్యక్షుడు ఏర్పుగొండ సురేష్, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు బత్తుల మల్లయ్య, బాణాల మల్లారెడ్డి, కూసు వెంకన్న, బిక్కి శ్రీనాథ్, పులుసు రవి, బత్తుల రమేష్ పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**మోతె, విశాలభారతి:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలిష్ సిబ్బంది అవగాహన కల్పించారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమం లో వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో విపరీతమైన తప్పుడు ఫోన్ కాల్స్ వస్తున్నాయని వాట్స్ యాప్ లో బ్యాంక్ వారు మాట్లాడుతూ న్నట్లు ఫేక్ కాల్స్ రావడం తో గందర గోళంలో పడోద్దని అటువంటి వారిని ఎవరు నమ్మవద్దని బాంక్ సమాచారం కోసం ఎవరి స్వంత ఎకౌంట్ కలిగిన బ్యాంక్ కు వెళ్ళి పూర్తి సమాచారం తెలుసుకోవాలని తెలిపారు గ్రామాలలో డ్రగ్స్ గంజాయి లాంటి విక్రయాలు జరిగిన వాడకం చేస్తున్న సమాచారం అందించి సహకరించాలని కొరారు రోడ్ల పైన విచ్చల విడిగా మద్యం చేవించ వద్దని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వీర స్వామి యువ రాజు, నాగయ్య, భాస్కర్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

**చిట్యాల, విశాలభారతి:** కొద్ది రోజులుగా కనిపించకుండా పోయిన వ్యక్తి మురుగు కాలువలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల పట్టణానికి చెందిన మేకల బిక్షం 21తేది నుండి కనిపించడం లేదని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శనివారం ఉదయం మున్సిపాలిటీ సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేస్తుండగా అనుమానాస్పద మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సైదాబాబు మిస్సింగ్ కేసుకు సంబంధించిన మేకల బిక్షం కుమారున్ని పిలిపించి మృతదేహాన్ని చూపించగా తన తండ్రి దేనని గుర్తించడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగింది. ఈ ఘటనపై పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత విచారణ చేపడతామని ఎస్.ఐ సైదాబాబు తెలిపారు.



# అభివృద్ధి మోదీతోనే సాధ్యం

- జిల్లా కార్యవర్గ సభ్యులు బింగి రమేష్ యాదవ్

**మరిపెడ, విశాలభారతి:** భారతదేశ అభివృద్ధి ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే సాధ్యపడుతుందని మహబూబా బాద్ జిల్లా బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బింగి రమేష్ యాదవ్ అన్నారు. మరిపెడ మండలం గుండెపుడి గ్రామం లో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బింగి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బిజెపి అభ్యర్థి మహబూబాబాద్ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ గెలుపు ఆకాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బింగి రమేష్ యాదవ్ మాట్లాడుతూ బిజెపికి ఓటు వేసి బిజెపి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు . గుండెపుడి గ్రామం లో ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణయ్య , మహేష్, సరిత, నాగమణి, కలమ్మ, విజయ, ఎల్లమ్మ, అనుష పద్మ , మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# జంగు పట్టిన వాటర్ లిఫ్టింగ్ చేసే గేటును మరమ్మతులు చేయాలి

- ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోని అధికారులు.
- తక్షణమే ఎర్జర్ల తూము గేటును మరమ్మతులు చేపియాలి.
- ఓబీసి మోర్చా మరిపెడ మండల అధ్యక్షుడు సొంటి రజనీకాంత్ గౌడ్



**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలం ఎర్జర్ల గ్రామంలో ఉన్న ఎర్జర్ల చెరువు కు రెండు తూములు ఉన్నాయి. వాటిలో ఒకటి గత మూడు. సంవత్సరాల క్రితం జంగు పట్టి విరిగిపోవడం జరిగింది. అప్పటినుంచి గత ప్రభుత్వ హాయంలో ఇరిగేషన్ అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు చెప్పుకున్నా, ఆ తూము మరమత్తులను ఎవరూ పట్టించుకోలేదు. ఆ చెరువుకు రెండు తూములు ఉంటాయి. వాటిలో వంపుతుము కింద చెరువులో నీళ్లు ఉంటే 500 ఎకరాలు పారకం జరుగుతుంది. కానీ గత మూడు సంవత్సరాల నుండి ఆ తూము మరమ్మత్తులు చేయకపోవడంతో చెరువు దగ్గరలో ఉన్న బోర్లలో కానీ, బావులలో నీరు లేకపోవడం వల్ల 500 ఎకరాలు పారకం చాలా కష్టమైందని, బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సొంటి రజనీకాంత్ గౌడ్ పేర్కొనడం జరిగింది. కాబట్టి గతంలోనే ఆ తూము మరమ్మతులు జరిగి ఉంటే వంపుతూములో నీళ్లు నిలువ ఉండేది. మరమ్మత్తులు జరగకపోవడం. వల్ల ఆ వంపుతూములో చుక్క నీరు లేకుండా నేర బడడం జరిగింది. కావున ఈ ప్రభుత్వ హాయంలో అయినా సంబంధిత అధికారులు ,నాయకులు ఈ వేసవి కాలంలో స్పందించి వానలు పడక ముందే .ఈ వంపుతుము ను సకాలంలో మరమ్మతులు చేయాల్సిందిగా గ్రామ రైతులు తరపున గ్రామ రైతుగా మరిపెడ మండల బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సొంటి రజనీకాంత్ గౌడ్ సంబంధిత అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లెపంగా రవి, బత్తుల శేషగిరి, మల్లెపంగా కొమురయ్య , మల్లెపంగు రమేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక బిఆర్ఎస్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పటాన్ చెరు,విశాలభారతి**:తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ ప్రతీక బీఆర్ఎస్ పార్టీ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని.. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహ సమీపంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..ఒక్కడితో మొదలైన బిఆర్ఎస్ ప్రస్థానం, ఉదృతమై ఉప్పెనగా మారి స్వరాష్ట్ర కలను సాకారం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న తెలంగాణను.. దశాబ్ది కాలంలో దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత బిఆర్ఎస్ కి దక్కిందన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల సభ్యత్వం బిఆర్ఎస్ కు ఉందన్నారు. ప్రతి కార్యకర్తకు 2 లక్షల రూపాయల రూపాయల ఉచిత ప్రమాద భీమా అందించడంతో పాటు, కష్టసుఖాల్లో అండగా ఉంటున్నామని తెలిపారు.కాంగ్రెస్ పాలనలో రైతులు, అన్నివర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నేడు మరోసారి ప్రజల పక్షాన ప్రజా ఉద్యమం చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ సంసిద్ధమైందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, హాశం, అజ్మత్, కొండల్, గుండమేళ్ల రాజు, రాంరెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి టీజర్ రిలీజ్

తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిభ గల యువ కథానాయకులలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఒకరు. కథలు, పాత్రల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, వరుస విజయాలను ఖాతాలో వేసుకుంటూ, ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. త్వరలో విశ్వక్ సేన్, మరో విభిన్న చిత్రం "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి"తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఇందులో ఆయన "లంకల రత్న" అనే శక్తివంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి" చిత్రానికి కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి" చిత్రం నుంచి తాజాగా టీజర్ విడుదలైంది. ఏప్రిల్ 27న సాయంత్రం హైదరాబాద్ లోని ఏఎంబీ మాల్ లో జరిగిన కార్యక్రమంలో టీజర్ ను విడుదల చేశారు నిర్మాతలు. ఈ సందర్భంగా కథానాయకుడు, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. "ఈ సినిమా మా టీమ్ అందరికీ ఎంతో ముఖ్యమైన సినిమా. ఈ చిత్రం కోసం ఎంతో కష్టపడ్డాం. ఏడాదిలో సినిమాని పూర్తి చేసి, అద్భుతమైన అవుట్ పుట్ తో మీ ముందుకు వస్తున్నాం. టీజర్ మీ అందరికీ నచ్చింది అనుకుంటున్నాను. టీజర్ లో మీరు చూసింది ఒక్క శాతమే. సినిమా మీ అంచనాలకు మించేలా ఉంటుంది. ఇది నేను చాలా ఇష్టపడి చేసిన సినిమా.. అందుకేనేమో భయంతో పెద్దగా మాటలు రావడం లేదు. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను. ఈ సినిమా తరువాత.. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి ముందు, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి తరువాత అనేలా నా కెరీర్ ఉంటుంది. ఇంత మంచి సినిమాని నాతో చేసిన నిర్మాత నాగ వంశీ గారికి నా కృతజ్ఞతలు. అలాగే వెంకట్ గారు, గోపీచంద్ గారు చిత్రీకరణ సమయంలో ఎంతో సపోర్ట్ చేశారు. దర్శకుడు కృష్ణ చైతన్య గురించి సినిమా విడుదలకు మాట్లాడతాను. అందమైన కథానాయికలు నేహా శెట్టి, అంజలి గారితో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. చివరిగా ఈ సినిమా గురించి ఒక్కటే చెప్తాను.. ఈసారి శివాలెత్తిపోద్ది. అలాగే మన పేరుకి న్యాయం చేసే సమయం వచ్చింది. అదే ఈ సినిమా. మే 17న థియేటర్లలో కలుద్దాం." అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగ వంశీ మాట్లాడుతూ.. "ఇది చాలా రోజుల తర్వాత విశ్వక్ నటించిన పక్కా మాస్ సినిమా. ఈ మూవీ ఏ రేంజ్ కి వెళ్తుంది అనేది మొదటి షో కి తెలిసిపోతుంది. ఈ ఎన్నికల హడావుడి ముగిశాక ట్రైలర్ ను విడుదల చేసి ప్రమోషన్స్ జోరు పెంచుతాం. టిల్లు స్క్వేర్ స్థాయిలో బ్లాక్ బస్టర్ అవుతుందని ఆశిస్తున్నాం." అన్నారు.



# జూన్ 27 ‘కల్కి 2898 AD’ గ్రాండ్ రిలీజ్


ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యుచరిస్ట్ సైన్స్ ఫిక్షన్ ఎపిక్ మాగ్నమ్ ఓపస్ 'కల్కి 2898 AD' జూన్ 27, 2024న ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్ వంటి ఇండియన్ బిగ్గెస్ట్ స్టార్స్ తో సహా దీపికా పదుకొణె, దిశా పటాని లాంటి ప్రముఖ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమా విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విడుదల తేదీకి సరిగ్గా రెండు నెలల ముందు ఈరోజు చేసిన అనౌన్స్మెంట్ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న ఎక్సయిట్మెంట్ మరింత పెంచింది. సోషల్ మీడియా ద్వారా, మేకర్స్ ఈ బిగ్గెస్ట్ న్యూస్ ను అనౌన్స్ చేశారు. అశ్వత్థామగా అమితాబ్ బచ్చన్ పాత్రను ఇటీవలి విడుదల చేసిన గ్లింప్స్ ద్వారా ప్రేక్షకులని 'కల్కి 2898 AD' వరల్డ్ లోకి తీసుకెళ్ళి ఆశ్చర్యపరిచారు. ముఖ్యంగా లెజెండరీ యాక్టర్ అద్భుతమైన డి-ఏజింగ్ ట్రాన్స్ ఫర్మేషన్ సర్ ప్రైజ్ చేసింది. ఈ ట్రూ పాన్-ఇండియా టీజర్ తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, ఇంగ్లీష్ సహా భాషల సమ్మేళనాన్ని ప్రజెంట్ చేసింది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 AD' ఈ సంవత్సరంలో బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్ గా అలరించనుంది. అన్ బిలివబుల్ తారాగణంతో వైజయంతీ మూవీస్ నిర్మాణంలో జూన్ 27, 2024న చాలా గ్రాండ్ గా విడుదల కానుంది.



# ఆ ఒక్కటీ అడక్కు కథ, కాన్సెప్ట్ బ్యూటీఫుల్ గా వుంటుంది

**: హీరోయిన్ ఫరియా అబ్దుల్లా**

కామెడీ కింగ్ అల్లరి నరేష్ ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు' తో రాబోతున్నారు. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా నటిస్తున్నారు. అల్లరి నరేష్ చాలా కాలం తర్వాత చేస్తున్న కామెడీ ఎంటర్ టైనర్ కావడంతో ఈ సినిమాపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ సినిమా టీజర్, ట్రైలర్ హ్యుజ్ బజ్ క్రియేట్ చేశాయి. మే 3న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానున్న నేపధ్యంలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా విలేకరులు సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు. ఇందులో నా పాత్ర పేరు సిద్ధి. నా పాత్ర చాలా స్వేచ్ఛగా వుటుంది. అన్ని ప్లాన్ చేసి, నిబంధనలు పెట్టుకొని అందులోనే బ్రతకడం తనకి ఇష్టం వుండదు. హీరో పాత్ర నా పాత్రకు భిన్నంగా వుంటుంది. తను అన్నీ ప్లాన్ ప్రకారం వుంటారు. ఈ రెండు పాత్రల మధ్య మంచి కాన్ఫ్లిక్ట్ వుంటుంది. అదే సమయంలో మంచి ఎట్రాక్షన్ వుంటుంది. కథ పెళ్లి అనే అంశం చుట్టూ ఉంటూ అందరినీ ఆకట్టుకునేలా వుంటుంది. ‘ఆ ఒక్కటీ అడక్కు' కథ, కాన్సెప్ట్ బ్యూటీఫుల్ గా వుంటుంది. ఈ సినిమాలో కామెడీ చాలా డిఫరెంట్ గా వుంటుంది. పరిస్థితుల నుంచే పుట్టే హాస్యం వుంటుంది. ఇందులో కామెడీ చాలా నేచురల్ గా పుడుతుంది. ఇందులో కంటెంట్ ప్రేక్షకులని సహజంగా నవ్విస్తుంది. నరేష్ గారితో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్. షూటింగ్ చాలా సరదాగా జరిగింది. నరేష్ గారి కామెడీ టైమింగ్ ఎక్స్ట్రార్డినరీ గా వుంటుంది. ఈ సినిమాతో ప్రేక్షకులని కడుపుబ్బా నవ్విస్తారు. ఇందులో చాలా హిలేరియస్ ఎంటర్ టైన్మెంట్ వుంటుంది. దర్శకుడు మల్లి గారు నాకు బౌండ్ స్క్రిప్ట్ ఇచ్చారు. అది నాకు చాలా ఎక్సయిటింగ్ గా అనిపించింది. అలాగే కథ గురించి చాలా చర్చించేవారు. అది నాకు చాలా ఆనందంగా అనిపించింది. ఆయన అందరి సలహాలు తీసుకుంటారు. ఎప్పుడూ నవ్వుతూనే వుంటారు. సినిమా షూటింగ్ అంతా ఫన్ గా జరిగింది. రాజీవ్ చిలక గారు చాలా పాషన్ వున్న నిర్మాత. సినిమాని ఎక్కడా రాజీపడకుండా చాలా గ్రాండ్ గా నిర్మించారు. సినిమాకి కావాల్సిన ప్రతిది సమకూర్చారు. వారి నిర్మాణంలో వర్క్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది.



# 'హరోం హర' థియేట్రికల్ రిలీజ్

సుధీర్‌బాబుకు తన మామగారు సూపర్‌స్టార్ కృష్ణ అంటే చాలా గౌరవం. కృష్ణ పుట్టినరోజు నాడు తన సినిమాల కంటెంట్ ఏదైనా విడుదల చేస్తుంటారు. ఈసారి తన అప్ కమింగ్ మూవీ 'హరోం హర' చిత్రాన్ని ఇండియన్ ఫస్ట్ సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మే 31న విడుదల చేయనున్నట్లు యూనిట్ అనౌన్స్ చేసింది. ఇది పర్ఫెక్ట్ డేట్. వేసవి సెలవుల దృష్ట్యా జూన్ రెండవ వారంలో పాఠశాలలు, కళాశాలలు తిరిగి తెరవడానికి కొన్ని వారాల కంటే ఎక్కువ సమయం ఉంటుంది. రిలీజ్ డేట్ పోస్టర్ పోస్టర్‌లో సుధీర్ బాబు చేతిలో వేలాయుధం ఉంది, అతని వెనుక ఉన్న వ్యక్తులు గౌరవ సూచకంగా చేతులు ఊపుతున్నారు. సూపర్ బాబు ఫెరోషియస్ గా కనిపిస్తున్న పోస్టర్ అదిరిపోయింది. ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్న యాక్షన్ థ్రిల్లర్‌కు సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నారు. మాళవిక శర్మ కథానాయికగా నటిస్తుండగా, సునీల్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. హరోం హర 1989లో చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో సాగే పీరియాడికల్ ఫిల్మ్. ఈ సినిమా కోసం కంప్లీట్ గా మేకోవరైన సుధీర్ బాబు కుప్పం స్లాంగ్‌లో డైలాగులు చెప్పనున్నారు. ది రివోల్ట్ అనేది సినిమా ట్యాగ్‌లైన్. టీజర్, పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.

అత్యంత విజయవంతమైన హారర్ కామెడీ సిరీస్ ‘అరణ్మనై’ నుంచి నాల్గవ చిత్రం అరణ్మనై 4 తెలుగులో ‘బాక్’ పేరుతో వస్తోంది. సుందర్ సి దర్శకత్వంతో పాటు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో తమన్నా భాటియా, రాశి ఖన్నా హీరోయిన్స్. తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. మే 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన ‘పంచుకో’ పాట అద్భుతమైన రెస్పాన్స్ తో చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. అవ్నీ సినిమాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై ఖుష్బు సుందర్, ఎసిఎస్ అరుణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేష్, కోవై సరళ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్ పి తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ఈ చిత్రానికి కృష్ణమూర్తి డీవోపీగా పని చేస్తుండగా, ఎడిటింగ్‌ను ఫెన్నీ ఆలివర్ పర్యవేక్షిస్తున్నారు. గురురాజ్ ఆర్ట్ డైరెక్టర్.

# ‘బాక్’ సెన్సార్ పూర్తి





# రోటి కపడా రొమాన్స్ అందరికీ నచ్చుతుంది

ప్రముఖ నిర్మాత బెక్కం వేణు గోపాల్ పుట్టినరోజు వేడుకను ‘రోటి కపడా రొమాన్స్’ చిత్ర బృందం ఘనంగా నిర్వహించారు. బెక్కం వేణు గోపాల్ ప్రారంభించిన లక్కీ మీడియా 18 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం కూడా విశేషం. ర్మాత సృజన కుమార్ బోజ్జం మాట్లాడుతూ: ఈ సినిమాతో నిర్మాతగా నా జర్నీ మొదలుపెట్టాను. బెక్కం వేణు గోపాల్ గారు నాకు చాలా సపోర్ట్ చేశారు. ఎప్పుడూ ఇలానే సపోర్ట్ చెయ్యాలను కోరుకుంటున్నాను హీరో హర్ష నర్రా మాట్లాడుతూ: మనం పుట్టినప్పుడు మన జీవితం మొదలవుతుంది కాని పది మందికి ఉపయోగపడినప్పుడే అసలైన జీవితం మొదలవుతుంది. లక్కీ మీడియా ద్వారా గత 18 సంవత్సరాలుగా ఎంతో మందికి ఉపయోగపడిన బెక్కం గారికి 18వ పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈయన జీవితం మాకు చాలా స్ఫోర్తి దాయకం. మా సినిమా రోటి కాపాడ రొమాన్స్ అందరికీ నచ్చే యూత్ ఫుల్ సినిమా అండి. అందరూ చూడండి. హీరో సందీప్ సరోజ్ మాట్లాడుతూ: బెక్కం సర్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు. మా సినిమా డేట్ కూడా త్వరలోనే చెప్తాము. డైరెక్టర్ విక్రం రెడ్డి మాట్లాడుతూ: యంగ్ టాలెంట్ కి ముందు గుర్తొచ్చేది లక్కీ మీడియా, కొత్తగా డైరెక్టర్ లేదా ప్రొడ్యూసర్ అవ్వాలి అంటే లక్కీ మీడియానే కేర్ అఫ్ అడ్రస్, నేను అలానే ఇక్కడి వరుకు వచ్చాను. మా సినిమాతో సర్ కి డబ్బులు బాగా రావాలని కోరుకుంటున్నాను బెక్కం వేణు గోపాల్ మాట్లాడుతూ: అందరికీ థాంక్స్. నేను నా సంస్థని 18 ఏళ్ళ ముందు మొదలుపెట్టినప్పటి నుండి నాతో ఉండి నాకు సపోర్ట్ చేసిన మీడియాకి చాలా థాంక్స్. ఒక్కొక్క సినిమా తీసుకుంటూ, ఎప్పుడు 18 ఏళ్ళు గడిచాయో కూడా తెలియలేదు. నేను ఈరోజు ఇక్కడ ఇలా ఉండడానికి ముఖ్య కారణం నా ఫ్యామిలీ, అలాగే నా ఫ్రెండ్స్, నా ఫ్రెండ్స్ లేకపోతే నేను ఈ పోసిషన్ లో నేను. నేను తీసిన ప్రతి సినిమాని నా ఫ్రెండ్స్ ఏ కొన్నారు. ఇప్పుడు వచ్చే రోటి కాపడా రొమాన్స్ కూడా మంచి హిట్ అవుతుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ సినిమాని కొనుక్కుంటుంది, వాళ్ళే త్వరలో అనౌన్స్ చేస్తారు. చాలా మంచి సినిమా తీసాం అని మంచి సాటిస్ఫ్యాక్షన్ ఉంది.

# బుల్లెట్ చిన్న చిత్రం కాదు.. మంచి సినిమా



శ్రీ బండి సదానంద్ & మెమరీ మేకర్స్ సోమిసెట్టి హరి కృష్ణ సమర్పించు, తుమ్మూరు కోట ఫిలిం సర్క్యూట్ బ్యానర్ పై నిర్మించిన చిత్రం 'బుల్లెట్'. ఎవ్వడికైనా దిగుద్ది ట్యాగ్ లైన్ తో దర్శకుడు చౌడప్ప రూపొందించారు. హీరో రవి వర్మ, సంజనా సింగ్, ఆలోక్ జైన్ ,మనీషా దేవ్, జీవ ,విజయ రంగరాజు ,సంధ్య శ్రీ, నర్సింగ్ యాదవ్, జబర్దస్త్ అప్పారావు ప్రధాన పాత్రలు పోషించారు. మార్చి 8న విడుదలైన ఈ చిత్రం 50 రోజులు పూర్తి చేసుకొని సక్సెస్ ఫుల్ గా ఇంకా థియేటర్లో కొనసాగుతుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ శుక్రవారం సాయంత్రం హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్స్ లో ఈ చిత్ర 50 రోజుల వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శోభారాణి, దర్శకులు వి సముద్ర హాజరయ్యారు. దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ.."బుల్లెట్ చిత్రం 50 రోజుల వేడుక చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. గోపీచంద్ ప్రభాస్ లాగా ఈ చిత్రంలోని హీరో రవివర్మ కూడా చాలా హైట్ ఉన్నాడు. తను కూడా వాళ్ళ లాగా సక్సెస్ అవ్వాలని కోరుతూ అందరికీ ఆల్ ద బెస్ట్" అని అన్నారు.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.